ప్రజాశక్తి

శనివారం 12 ఏప్రిల్ 2025

8 పేజీలు



విశాఖపట్నం



అనకాపల్లి

అవిశ్వాసంపైనే కూటమి ఆశలు

- గ్రేటర్ మేయర్ పీఠంపై సర్వత్రా చర్చ
- ప్రపోజల్ కాపీపై కొనసాగుతున్న అభ్యంతరాలు
- 74 సంఖ్యే లక్ష్యంగా టిడిపి ముమ్మర యత్నాలు
- కొనసాగుతున్న క్యాంపు రాజకీయాలు



ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

ఈ నెల 19వ తేదీ కోసం జివిఎంసిలోని కూటమి పార్టీలు కళ్లు కాయలు కాచేలా ఎదురు చూస్తున్నాయి. గ్రేటర్ విశాఖ మేయర్ పీఠాన్ని ఎలాగైనా దక్కించుకోవాలన్నదే ఆ పార్టీల లక్ష్యంగా ఉంది. అందులో భాగంగానే ఏప్రిల్ 2న జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేందిర ప్రసాద్‌ను కూటమి కార్పొరేటర్లు, నాయకులు కలిసి జివిఎంసి మేయర్ గొలగాని హరి వెంకటకుమారిపై అవిశ్వాస నోటీసు ఇచ్చారు. అప్పటి నుంచీ మేయర్ పీఠంపై సర్వత్రా చర్చ నడుస్తోంది. కార్పొరేషన్‌లో 74 మంది కార్పొరేటర్లు ఏ పార్టీ వైపు చేతులెత్తుతారో ఆ పార్టీకే మేయర్ పీఠం దక్కనుంది. ఆ సంఖ్యా కోసం టిడిపి పడరాని పాట్లు పడుతోందనడంలో ఎలాంటి సందేహమూ లేదు. ప్రస్తుతం 72 మంది వరకూ కార్పొరేటర్లు కూటమి గూట్లో ఉన్నట్లు సమాచారం. గడిచిన రెండు, మూడు రోజుల్లో మరో ఇద్దరు వైసిపి కార్పొరేటర్లను టిడిపి గాలం వేసి లాగేసిందన్న చర్చ సాగుతోంది. వారిలో గాజువాక, గోపాలపట్నం ఏరియాల కార్పొరేటర్లు ఉన్నట్టు సమాచారం. ఇదిలా వుండగా మరోవైపు క్యాంపు రాజకీయాల్లో కార్పొరేటర్లు సేదతీరుతున్నారు. వైసిపి కార్పొరేటర్లు బెంగళూరుకు వెళ్లారు. టిడిపి కార్పొరేటర్లు మలేషియా టూర్‌లో ఉన్నారు. టిడిపి నుంచి పీలా శ్రీనివాసరావు మేయర్ పీఠాన్ని దక్కించుకోవాలని పావులు కదుపుతున్న సంగతి తెలిసిందే. దీంతో కూటమిలోని టిడిపికి ప్రధానంగా 19న ఏం జరుగబోతుందన్న ఆందోళన ఎక్కువైంది.

రూల్ పొజిషన్ ఏమిటి ?

ఓ వైపు క్యాంపు రాజకీయాలు నడుస్తుండగా అవిశ్వాసం ప్రతిపాదించేటప్పుడు పాటించాల్సిన (రూల్ పొజిషన్) పద్ధతిపై తాజాగా ఓ దుమారం తెరపైకి వచ్చింది. అది కూడా కూటమి భాగస్వామి పక్షమైన జనసేన నుంచే రావడం గమనార్హం. మున్సిపల్ చట్టం ఉల్లంఘన జరిగిందని జనసేన 22వ వార్డు కార్పొరేటర్ పీతల మూర్తి యాదవ్ తాజాగా జిల్లా కలెక్టర్‌కు లేఖ ద్వారా అభ్యంతరం తెలిపారు. అందులో 58 మంది సభ్యుల సంతకాల ఆధారాలు ఎక్కడా సమర్పించినట్టు తన దృష్టిలో లేదని పేర్కొనడంతో కూటమి కాస్త ఇరకాటంలో పడిందనే చెప్పొచ్చు. మేయర్ పీఠం కోసం కాచుకుని కూర్చొన్న వారు కొంతమంది కార్పొరేటర్ల ఇళ్లకు తిరిగి సంతకాలు పెట్టించుకునే తీరు వెల్లడవుతోంది. మేయర్‌పై అవిశ్వాస మిగతా 2లో..

స్టీల్‌ప్లాంట్‌లో..

కాంట్రాక్టు కార్మికుల తొలగింపులు ఆపండి

ముఖ్యమంత్రికి సిపిఎం ఫ్లోర్ లీడర్ డాక్టర్ బి.గంగారావు లేఖ

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : స్టీల్‌ప్లాంట్‌లో కాంట్రాక్ట్ కార్మికుల అక్రమ తొలగింపులు ఆపాలని, ఈ నెల 16 నుంచి జరిగే కార్మికుల నిరవధిక సమ్మెను నివారించాలని కోరుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు జివిఎంసిలోని సిపిఎం ఫ్లోర్ లీడర్, 78వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు లేఖ రాశారు. ఆ వివరాలను శుక్రవారం మీడియాకు వెల్లడించారు. స్టీల్‌ప్లాంట్‌లో 30 ఏళ్లుగా పనిచేస్తూ కర్మాగార ప్రగతిలో కాంట్రాక్ట్ కార్మికులు కీలకపాత్ర పోషిస్తున్నారన్నారు. వారిలో ఐదు వేల మందిని ప్లాంట్ యాజమాన్యం అక్రమంగా తొలగిస్తోందని తెలిపారు. కార్మిక సంఘాలతోగానీ, కాంట్రాక్టర్లతోగానీ సంప్రదింపులు జరపకుండా నిరంకుశత్వంగా కాంట్రాక్టు కార్మికులను తొలగిస్తూ వారి కుటుంబాలను వీధిపాలు చేస్తోందన్నారు. ఇప్పటికే రెండు వేల మంది కాంట్రాక్ట్ కార్మికులను తొలగించినట్టు తెలిపారు. ఇది అత్యంత దుర్మార్గమైన చర్యని పేర్కొన్నారు. ఈ చట్ట వ్యతిరేక చర్యల పట్ల కాంట్రాక్ట్ కార్మిక సంఘాలు నిరసన తెలిపాయన్నారు. విశాఖపట్నం రీజనల్ లేబర్ కమిషనర్ సమక్షంలో పలుదఫాలుగా చర్చలు కొనసాగుతున్నాయన్నారు. ఈ తరుణంలో కాంట్రాక్ట్ కార్మికుల తొలగింపు చట్ట విరుద్ధమని, తక్షణం వారిని విధుల్లోకి తీసుకోవాలని లేబర్ డిపార్ట్‌మెంట్ అధికారులు ఆదేశాలు ఇచ్చినా స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం బేఖాతరు చేస్తోందని అన్నారు. కార్మిక సంఘాలతో చర్చల ప్రక్రియ జరుగుతుండగానే యాజమాన్యం చర్చలను గౌరవించకుండా, కార్మిక శాఖ అధికారుల సూచనలను సైతం పెడచెవిన పెట్టి కాంట్రాక్టు కార్మికుల గేట్ పాసులను రద్దు చేస్తోందన్నారు. పోలీసుల పహారా పెట్టి కార్మికులను భయభ్రాంతులకు గురిచేస్తోందని తెలిపారు. కాంట్రాక్టు కార్మికుల్లో ఎక్కువ మంది ఉక్కు కర్మాగారం కోసం భూములను, ఇళ్లను త్యాగం చేసినవారేనని తెలిపారు. ప్లాంట్ కోసం రూ.11,440 కోట్లు ప్యాకేజీ ఇచ్చినప్పుడు ఐదు వేల మంది కాంట్రాక్ట్ కార్మికులను తొలగించాలని కేంద్ర బిజెపి ప్రభుత్వం షరతు విధించిందని యాజమాన్యం తెలియజేస్తోందన్నారు. దానిలో భాగంగానే 1140 మంది పర్మినెంట్ కార్మికులను విఆర్‌ఎస్ పేర బయటకు పంపారన్నారు.

తొలగింపులు స్టీల్‌ప్లాంట్ ఉత్పత్తిపై తీవ్ర ప్రభావం చూపుతాయన్నారు. ఈ క్రమంలో స్టీల్‌ప్లాంట్ కార్మికుల ఉపాధిని, ప్లాంట్ భవిష్యత్తును కాపాడాల్సిన బాధ్యత కూటమి ప్రభుత్వంపై ఉందన్నారు. ఎన్నికల హామీకి కూటమి పాలకులు కట్టుబడి ఉండాలన్నారు.

బకాయి జీతాలు చెల్లించాలని సినర్జీస్ కార్మికుల ధర్నా

వార్త 4లో..

ఈదురుగాలుల బీభత్సానికి తీవ్ర నష్టం

వార్త 5లో..

పయనీరు కార్మికుల పోరాట విజయం

వార్త 5లో..



విశాఖలో జ్యోతిరావు పూలే చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్

మహనీయుడు జ్యోతిరావు పూలే

వాడవాడలా జయంతి వేడుకలు వార్తలు 7లో..

కెజిహెచ్‌లో..

జనన ధ్రువీకరణ కేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : కెజిహెచ్‌లోని ప్రసూతి, గైనకాలజీ (ఒబిజివై) విభాగంలో జనన ధ్రువీకరణ కేంద్రాన్ని దక్షిణ ఎమ్మెల్యే సిహెచ్.వంశీకృష్ణ శ్రీనివాస్ శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనన ధ్రువీకరణ పత్రాలను అతి తక్కువ సమయంలోనే పొందటానికి ఆధునిక పద్ధతిలో దీన్ని ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కెజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.శివానంద, పలు విభాగాల అధిపతులు పాల్గొన్నారు.

ఇదిలా ఉండగా కెజిహెచ్ అధికారుల వ్యవహార శైలిపై బాలల హక్కుల కమిషన్ సభ్యుడు గొండు సీతారాం ఒక ప్రకటనలో మండిపడ్డారు. బాలల హక్కుల కమిషన్‌కు గౌరవం కల్పించడంలో విఫలమైన కెజిహెచ్ అధికారులపై నేషనల్ చైల్డ్ రైట్స్ కమిషన్‌కు, ప్రభుత్వానికి ఫిర్యాదు చేస్తానని తెలిపారు. ధ్రువీకరణ కేంద్రం ప్రారంభానికి సంబంధించి తమకు కనీస సమాచారం కూడా ఇవ్వలేదన్నారు.

జిఎస్‌టితో పన్ను ఎగవేతలకు చెక్

కమిషనర్ పి.ఆనంద్‌కుమార్ వెల్లడి

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

జిఎస్‌టి అమలుతో పన్ను ఎగవేతదారులు తప్పించుకోలేని పరిస్థితులు దేశంలో నెలకొన్నాయని సిజిఎస్‌టి కమిషనర్ (ఆడిట్) పి.ఆనంద్ కుమార్ అన్నారు. శుక్రవారం మధ్యాహ్నం విశాఖలోని పోర్టు ట్రస్ట్ సీ హార్స్ జంక్షన్ వద్దగల జిఎస్‌టి భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. అమరావతి నిర్మాణం, పోలవరం ప్రాజెక్టుకు నిధులు జిఎస్‌టి పక్కా అమలుతో సమకూరుతాయని తెలిపారు. జిఎస్‌టి వసూలు చేస్తున్న సందర్భంలో కొన్ని నకిలీ ఇన్వాయిస్‌లనూ పట్టుకుంటున్నామన్నారు. ఈ ఏడాది రూ.1500 కోట్లు నకిలీ ఇన్వాయిస్‌లను గుర్తించగా రూ.250 కోట్లను ఇప్పటి వరకూ వసూలు చేశామన్నారు. జిఎస్‌టి కౌన్సిల్‌లో ధరల రేషనలైజేషన్‌లపై చర్చలు జరుగుతున్నాయన్నారు. త్వరలో జిఎస్‌టి రేట్లు, పన్నుల స్లాబుల రేట్లు తగ్గే అవకాశం ఉందన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో సిజిఎస్‌టిలో 5 సర్కిల్స్ ఉన్నాయని, వాటిలో 28 గ్రూపుల ద్వారా 2024-25లో ఆడిట్ ద్వారా రూ.150 కోట్లు ఆదాయం తెచ్చామని అన్నారు. రాష్ట్రంలో సుమారు 60 లక్షల మంది పన్ను చెల్లింపుదారులు ఉన్నారన్నారు.



మాట్లాడుతున్న ఆనంద్ కుమార్

ఇబ్బందుల్లో ప్రభుత్వ రంగ సంస్థలు

విశాఖ స్టీల్‌ప్లాంట్ గడిచిన కొన్నాళ్లుగా ఇబ్బందుల్లో మిగతా 2లో..

మొదటి పేజీ తరువాయి..

అవిశ్వాసంపైనే కూటమి ఆశలు

తీర్మానానికి వెళ్లే ముందు 58 మంది సభ్యులు ఒక చోట సమావేశం నిర్వహించి మినిట్స్ బుక్‌లోసంతకాలు పెట్టి ఆ కాపీ ఆధారంగా అవిశ్వాసం ఇవ్వాల్సి ఉండగా ఈ తరహాలో జరగకపోవడం కొట్టొచ్చినట్టు కనిపిస్తోంది.

కార్పొరేషన్‌లో 78వ వార్డు సిపిఎం కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు అవిశ్వాస తీర్మానంలో పాల్గొనడం లేదని ఇప్పటికే వెల్లడించారు. నగర పౌరుల సమస్యలను పరిష్కరించే మార్గాలు కూటమి, వైసిపిల వద్ద లేవని ఆయన స్పష్టం చేశారు. పార్టీ విధాన నిర్ణయం ప్రకారం మేయర్‌పై అవిశ్వాసం కోసం జరిగే ఓటింగ్‌లో పాల్గొనడం లేదన్నారు. సిపిఐ కార్పొరేటర్ స్టాలిన్ 'ప్రజాశక్తి'తో మాట్లాడుతూ పార్టీ నిర్ణయమే తన నిర్ణయమని అన్నారు.

జిఎస్‌టితో పన్ను ఎగవేతలకు చెక్

ఉందని, హెచ్‌పిసిఎల్ పరిస్థితీ అలాగే ఉందని, ప్రభుత్వ రంగ సంస్థలు బలంగా ఉంటేనే జిఎస్‌టి కూడా కేంద్ర ప్రభుత్వానికి బాగా వస్తుందని ఆనంద్ కుమార్ అన్నారు. రాష్ట్రంలో అత్యధికంగా కియా మోటార్స్ ద్వారా జిఎస్‌టి ఆదాయం లభిస్తోందని అన్నారు. విశాఖలో ఆటోమొబైల్ ఇండస్ట్రీ ద్వారా జిఎస్‌టి చేకూరుతోందన్నారు. మరో ఏడాదిలో విశాఖలోగల సిజిఎస్‌టి భవన్‌ను అమరావతికి ప్రభుత్వం తరలిస్తుందని వెల్లడించారు. సమావేశంలో జిఎస్‌టి అధికారులు అరవింద్ దాస్, సత్యనారాయణ, రవి కిరణ్, వెంపర్ల శ్రీనివాస్ పాల్గొన్నారు.

పారిశ్రామిక ఉత్పత్తుల ప్రదర్శన ప్రారంభం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : బీచ్ రోడ్ వద్ద ఉన్న గాదిరాజు ప్యాలెస్ వేదికగా మూడు రోజులపాటు నిర్వహించనున్న ఇండస్ట్రియల్ ఇంజినీరింగ్ ఎక్స్‌పో (పారిశ్రామిక ఉత్పత్తుల ప్రదర్శన)ను జిల్లా ఎంఎస్‌ఎంఇ విభాగం డైరెక్టర్ కెఎల్ఎస్.రెడ్డి శుక్రవారం మధ్యాహ్నం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటువంటి ఎక్స్‌పోల నిర్వహణ ద్వారా పారిశ్రామిక ఉత్పత్తులను వినియోగదారులకు మరింత చేరువ చేయవచ్చునన్నారు. మేకిన్ ఇండియా ద్వారా ఉత్పత్తి చేసిన వస్తువులను మార్కెట్ చేసుకునేందుకు ఈ వేదిక ఉపయోగపడుతుందని తెలిపారు. అనంతరం ఎక్స్‌పో నిర్వాహకుడు ఇండోర్ ఇన్ఫోలైన్ ప్రైవేట్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ ఆర్‌కె.అగర్వాల్ మాట్లాడుతూ ఈ ప్రదర్శనలో ఐదు వేల రకాల ఇంజినీరింగ్, పారిశ్రామిక ఉత్పత్తులను ప్రదర్శనకు ఉంచినట్టు తెలిపారు. ఉదయం 11 గంటల నుండి సాయంత్రం 6:30 గంటల వరకు ఈ ప్రదర్శన ఉంటుందని, ప్రవేశం ఉచితమని తెలిపారు.



స్టాల్స్‌ను పరిశీలిస్తున్న కెఎల్ఎస్.రెడ్డి తదితరులు

గిగ్ వర్కర్స్ భద్రతకు చట్టం తేవాలి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : గిగ్ వర్కర్స్, రైడర్స్‌కు భద్రత కల్పిస్తూ ప్రభుత్వం చట్టం తేవాలని ఆల్ ఇండియా గిగ్ వర్కర్స్ యూనియన్ విశాఖ జిల్లా అధ్యక్షులు బి.జగన్ డిమాండ్ చేశారు. శుక్రవారం జగదాంబ దరి సిఐటియు కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ ఆక్సిజన్ టవర్ ఘటన మరవక ముందే మరో ఘటన కణితి ప్రాంతంలో చోటుచేసుకుందన్నారు. విశాఖలోని శ్రీనగర్ పెట్రోల్ బంక్ దగ్గర మణికంఠ అనే వ్యక్తి రాపిడో బుక్ చేసుకున్నాడని, రైడ్ స్టార్ట్ అయ్యి బైక్ కణితి శ్మశాన వాటిక సమీపంలోకి చేరగానే బైకు ఆపాలని కోరాడన్నారు. ఆపిన వెంటనే రైడర్‌పై బెదిరింపులకు పాల్పడి, దాడి చేసి, ఫోన్ పే ద్వారా రూ.48 వేలు ట్రాన్స్‌ఫర్ చేసుకుని పరారైనట్టు తెలిపారు.

ఈ ఘటన రైడర్స్‌లో తీవ్ర ఆందోళన కలిగిస్తోందన్నారు. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వారికి భద్రత కల్పించాలని కోరారు.

టౌన్ ప్లానింగ్ ఓపెన్ ఫోరమ్‌కు 20 వినతులు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : జివిఎంసి ప్రతి శుక్రవారం నిర్వహిస్తున్న టౌన్ ప్లానింగ్ ఓపెన్ ఫోరమ్‌కు సంబంధించి 20 వినతులు వచ్చాయని జివిఎంసి చీఫ్ సిటీ ప్లానర్ ఎ.ప్రభాకరరావు తెలిపారు. శుక్రవారం ఆయన జివిఎంసి ప్రధాన కార్యాలయంలోని సమావేశ మందిరంలో సిపిలు, డిసిపిలు, ఎసిపిలతో కలిసి ప్రత్యేకంగా టౌన్ ప్లానింగ్ ఓపెన్ ఫోరమ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. నిర్ణీత సమయంలో టౌన్ ప్లానింగ్ అధికారులు సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు.

కలెక్టరేట్‌లో చలివేంద్రం, మజ్జిగ కేంద్రం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : వివిధ పనులపై కలెక్టర్ కార్యాలయానికి వచ్చే ప్రజల సౌకర్యార్థం జిల్లా కలెక్టరేట్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన చలివేంద్రం, ఉచిత మజ్జిగ కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్ శుక్రవారం లాంఛనంగా ప్రారంభించారు. ఎండవేడిమి నుంచి ఉపశమనం పొందేందుకు వీలుగా వైద్యారోగ్య శాఖ ఆధ్వర్యంలో ఓఆర్ఎస్ కౌంటర్‌ను కూడా ప్రారంభించి అందుబాటులోకి తీసు కొచ్చారు. ఈ క్రమంలో కలెక్టరేట్ సిబ్బందికి, ప్రజలకు ఆయన చేతుల మీదుగా మజ్జిగ అందజేశారు. కార్యక్రమంలో డిఆర్‌ఒతో పాటు కలెక్టరేట్ ఎఒ ఈశ్వరరావు, ఆరోగ్య శాఖ సిబ్బంది, రెడ్ క్రాస్ ప్రతినిధులు పాల్గొన్నారు.


మజ్జిగ పంపిణీ చేస్తున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్

ఎయిర్ కంప్రెసర్ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక వ్యవస్థ

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : వివిధ పరిశ్రమల్లో గాలి సాంద్రత, కంప్రెసెడ్ సిస్టం సమర్థ రీతిలో పనిచేసేందుకు నూతన వ్యవస్థను రూపొందించినట్టు మాన్ ఫ్లస్ హమ్మెల్ తయారీ ఇంజినీరింగ్ సీనియర్ మేనేజర్ స్టీవెన్ ఓవెన్స్ మీడియాకు తెలిపారు. వడపోత వ్యవస్థలను అందించడంలో ప్రసిద్ధి చెందిన సంస్థలలో ఒకటైన మాన్ ఫ్లస్ హమ్మెల్, ఎల్గీ ఎక్విప్మెంట్స్ లిమిటెడ్ అనుబంధ సంస్థ అయిన పట్టొన్స్ ఇంక్ మధ్య భాగస్వామ్యం కుదిరిందన్నారు.

గిరిజన ప్రాంతాన్ని కార్పొరేట్లకు కట్టబెట్టడం తగదు

ప్రజాశక్తి - రాజవొమ్మంగి : టూరిజం అభివృద్ధి పేరుతో గిరిజన ప్రాంతాలను కార్పొరేట్లకు అప్పజెప్పే ప్రయత్నాన్ని ప్రభుత్వం తక్షణమే మానుకోవాలని ఆదివాసి జేఏసీ జిల్లా నాయకులు వంతు బాలకృష్ణ, పీసా కమిటీల మండల అధ్యక్షులు తాము సూరిబాబు డిమాండ్ చేశారు. మండలంలోని నెల్లిమెట్ల గ్రామంలో శుక్రవారం జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ ఈనెల 9న రంపచోడవంలో ఐటిడిఎలో నిర్వహించిన వర్క్‌షాపులో టిడిపి ఎమ్మెల్యే, వైసిపి ఎమ్మెల్సీ, అధికార పార్టీ నాయకులతో మాట్లాడించి ఒక నోట్ తయారు చేసి విడుదల చేశారని, అభివృద్ధి, టూరిజం మాటున ఏజన్సీ ప్రాంతంలో ఉన్న ఖనిజ సంపదను దోచుకోవడమే దీని వెనుకనున్న మర్మమని ఆరోపించారు. ఈ ప్రక్రియ రెండు మూడు నెలల నుంచి కొనసాగుతోందని, గతంలో శాసనసభ స్పీకర్ అయన్న పాత్రుడు 1/70 చట్టానికి వ్యతిరేకంగా వ్యాఖ్యలు చేయడం దీనిలో భాగమేనని చెప్పు కొచ్చారు.

రబీ ధాన్యం అమ్మకాలకు అవస్థలు

- కొనుగోలు లేక కళ్లాల్లోనే ధాన్యం
- అకాల వర్షాలతో రైతుల ఆందోళన
- గిట్టుబాటు ధర ఇవ్వని దళారులు


ధాన్యం ఆరబెడుతున్న రైతు

ప్రజాశక్తి -ఆనందపురం: రబీ సీజన్‌లో పండించిన వరి పంటను అమ్ముకునేందుకు రైతులు అవస్థలు పడుతున్నారు. ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటుచేసి సేకరిస్తోంది. కానీ రబీకి ఆ అవకాశం లేకపోవడంతో దళారుల ఇష్టారాజ్యం అవుతోంది. దళారులు నిర్ణయించిన రేటుకే విక్రయించాల్సిన పరిస్థితి దాపురిస్తోంది. రైతులకు భరోసాగా ఉంటామని ప్రభుత్వాలు, నాయకులు ప్రకటనలివ్వడమే తప్ప ఆచరణలో ఒరిగిందేమీ ఉండడంలేదు.

ఆనందపురం మండలం బోని గ్రామంలో అత్యధిక మంది రైతులు రబీ సీజన్‌లో వరిపంటను సాగుచేస్తుంటారు. ఈ ఏడాది సుమారు 200 మంది రైతులు 600 ఎకరాల్లో వరి పంటను సాగుచేశారు. పండించిన ధాన్యం అమ్ముకానికి సిద్ధం చేసినా కొనేవారు లేక ఇప్పుడు అవస్థలు పడుతున్నారు. కొంతమంది రైతులు కౌలుకు తీసుకొని వరిని పండిస్తున్నారు గ్రామానికి చెందిన కనకల దుర్గారావు 20 ఎకరాల్లో, బేరి శ్రీను 15 ఎకరాల్లో, బోను గోవింద 10 ఎకరాల్లో, సీతమ్మ గారి శ్రీను 6 ఎకరాల్లో, కనకల సీతారాం 5 ఎకరాల్లో, బొడ్డి శ్రీను 3 ఎకరాల్లో, బోని సూర్యారావు 8 ఎకరాల్లో, బుగత సూరి 7 ఎకరాల్లో, బోని బంగారమ్మ 3 ఎకరాలలో వరి పంటను పండించారు. ధాన్యం సిద్ధం చేసి బస్తాల్లో ఎత్తి అమ్మకానికి చూస్తున్నారు. పొలాల్లోనూ, కళ్లాల్లోనూ, మరికొంతమంది సామాజిక భవనం ఆరుబయట ఉంచారు.

ప్రస్తుతం అకాల వర్షాలు రావడంతో తీవ్ర ఆందోళన చెందుతున్నారు. పంట తడిసి పాడైపోతుందని, ఎంతకైనా అమ్మడానికి సిద్ధపడుతున్నారు. 1010 రకం ధాన్యం 82 కేజీల బస్తా రూ.1800 ఉండేది. ప్రస్తుతం అకాల వర్షాల కారణంగా దళారులు సిండికేట్ అయి రూ.1300 మాత్రమే ఇస్తామని చెప్పడంతో రైతులు దిగులు చెందుతున్నారు. పెట్టుబడులు కూడా రావంటూ ఆందోళనలో ఉన్నారు. ఒక వైపు వర్షం ఆందోళన, మరో వైపు దళారుల దోపిడీతో రైతులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు.

గొడౌన్లు ఏర్పాటుచేయాలి

రైతులు పండించిన పంటను ఆరబెట్టి నిల్వ ఉంచేందుకు గొడౌన్లను ఏర్పాటుచేయాలి. ఈ విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పరిష్కారం లభించలేదు.

బోని అప్పలకొండ
గ్రామ సర్పంచ్

రబీ వరి కొనుగోలుకు అనుమతులు లేవు

బోని గ్రామంలో రబీలో రైతులు వరి ధాన్యాన్ని పండించారు. ఖరీఫ్ సీజన్‌లో మాత్రమే ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటుకు అనుమతులు ఉన్నాయి. రబీ సీజన్‌కు కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు అనుమతులు లేవు. దీంతో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుచేయడంలేదు. బోని గ్రామస్తులు విషయాన్ని పైఅధికారులకు తెలియజేసి సమస్య పరిష్కారానికి కృషి చేస్తాను.

సంధ్యా రత్నప్రభ
వ్యవసాయాధికారి

నేరాలు ఘోరాలు

బేకరీ స్వీట్ షాప్ దగ్ధం

ప్రజాశక్తి -గాజువాక : గాజువాక పోలీస్‌స్టేషన్ చినగంట్యాడ జగ్గు జంక్షన్ సమీపంలోని బెంగళూరు అయ్యంగార్ బేకరీ స్వీట్ షాప్‌లో గురువారం అర్ధరాత్రి అగ్ని ప్రమాదం సంభవించింది. పెదగంట్యాడ అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని పక్క దుకాణాలకు మంటలు వ్యాపించకుండా అరికట్టారు. ఈ ప్రమాదంలో బెంగళూరు అయ్యంగార్ బేకరీ స్వీట్ షాప్ మొత్తం దగ్ధమైంది. దాదాపు రూ.5 లక్షల నష్టం వాటిల్లినట్లు నిర్వాహకులు చెబుతున్నారు.


ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పిస్తున్న ఆ శాఖ అధికారులు

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన

ప్రజాశక్తి -పద్మనాభం : మండలంలోని అయినాడ గ్రామంలో ప్రకృతి వ్యవసాయంపై శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఖరీఫ్ యాక్షన్ ప్లాన్ గురించి రైతులకు నవధాన్యాల సాగు, ప్రకృతి వ్యవసాయ విభాగం ఎన్‌ఎఫ్‌ఎ మహేంద్ర వివరించారు. రాష్ట్ర తూర్పు కాపు కార్పొరేషన్ డైరెక్టర్ లీలావతి మాట్లాడుతూ, రసాయనాలకు దూరంగా ఉంటూ ప్రకృతి వ్యవసాయ విధానాలను రైతులు అలవర్చుకుంటే భావి తరాల బంగారు భవిష్యత్తుకు దోహద పడవచ్చని తెలిపారు. అనంతరం అయినాడ గ్రామంలో ప్రకృతి వ్యవసాయ రైతులుగా విశేష కృషి చేస్తున్న కురిమిన సత్యారావు, గొడ్డు కృష్ణలను ఉత్తమ ప్రకృతి వ్యవసాయ రైతులుగా గుర్తించి సన్మానించారు. ఈ కార్యక్రమంలో విఎఎ లావణ్య, ప్రకృతి వ్యవసాయ ఎమ్‌టి విద్యాసాగర్, గ్రామ సర్పంచ్ అరుణ్‌జ్యోతి, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, స్థానిక రైతులు పాల్గొన్నారు.



అవార్డు అందుకుంటున్న జివిఎంసి అదనపు కమిషనర్ వర్మ

ఆస్తి పన్ను వసూళ్లలో జివిఎంసికి అవార్డు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి జివిఎంసి ఆస్తి, ఖాళీ జాగా పన్నుల వసూళ్లలో రూ.510 కోట్ల మార్క్‌ను చేరుకుని రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలిచిన దరిమిలా మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, అర్బన్ డెవలప్‌మెంట్ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎస్.సురేష్ కుమార్ విజయవాడలో జివిఎంసికి అవార్డు అందజేశారు. దీన్ని జివిఎంసి అదనపు కమిషనర్ ఎస్.ఎస్.వర్మ స్వీకరించారు. ఆయనకు జివిఎంసి ఇన్‌ఛార్జి కమిషనర్ హరేంధిర ప్రసాద్ సహా పలువురు అధికారులు అభినందనలు తెలిపారు.

జాబ్ మేళా కేలండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి -పాడేరు, : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో 2025-26 ఆర్థిక సంవత్సరంకు సంబంధించి మొదట త్రైమాసిక జాబ్ మేళా క్యాలెండర్ ను జిల్లా కలెక్టర్ ఎస్ దినేష్ కుమార్ ఆవిష్కరించారు. శుక్రవారం స్థానిక ఐటిడిఎలో జరిగిన మీకోసం కార్యక్రమం అనంతరం జరిగిన ఒక ప్రత్యేక కార్యక్రమంలో జాబ్ మేళా క్యాలెండర్ ఆవిష్కరించిన కలెక్టర్ మాట్లాడుతూ, ఈ నెల 17వ తేదీన అరకు వాలీ గవర్నమెంట్ జూనియర్ కళాశాల ప్రాంగణంలో జాబ్ మేళా నిర్వహించడం జరుగుతుందని, మే నెల 2 వ తేదీన పాడేరు, అదేవిధంగా జూన్ నెల 6వ తేదీన రంపచోడవరంలో ఈ మెగా జాబ్ మేళాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

శవాల పుంజు మృతి

ప్రజాశక్తి -ఆనందపురం : ఆనందపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో అనాథ మృతదేహాలను తరలించే శవాల పుంజు అలియాస్ సియాద్రి నర్సింగరావు (44) శుక్రవారం మృతి చెందాడు. నర్సింగరావు గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఆనందపురం మండలం ఎల్‌వి.పాలెం ఎస్సీ కాలనీకి చెందిన సియాద్రి దేవుడు, అప్పమ్మ దంపతుల రెండో సంతానమైన నర్సింగరావు చిన్నప్పటి నుంచి చలాకీగా ఉండేవాడు. 20 సంవత్సరాలుగా మండలంలో ఎక్కడైనా గుర్తుతెలియని మృతదేహాలు ఉంటే మొదటగా పోలీసులు నర్సింగరావును పిలిచేవారు. మృతదేహాలను వెలికి తీసి భుజాలపై మోసుకుని వెళ్లి వాహనాల్లో వేసేవాడు. దీంతో శవాల పుంజుగా పేరొందిన ఆయన మృతి పట్ల మండల వాసులు విచారం వ్యక్తంచేశారు. సింహాద్రి రాంబాబు, సోదరులు అంత్యక్రియలు నిర్వహించారు. స్థానిక నాయకులు పరామర్శించారు.

సెలవు రోజుల్లోనూ ఆస్తి పన్ను చెల్లించొచ్చు

ప్రజాశక్తి- మధురవాడ : జివిఎంసి జోన్ -2 కార్యాలయము పరిధిలో గల ఇంటి, ఖాళీ స్థలాల పన్నులు, నీటి పన్నులు చెల్లింపుదారుల సౌకర్యార్థం జోనల్ కార్యాలయంలో పన్ను చెల్లింపు కేంద్రం ఆదివారం, ఇతర సెలవు రోజులలో కూడా తెరిచే ఉంటుందని జోనల్ కమిషనర్ కనకమహాలక్ష్మి తెలిపారు. జోనల్ కార్యాలయంలోని సౌకర్యం కేంద్రం ఈ నెల 30 తేదీ వరకు ప్రతిరోజూ ఉదయం 8 నుంచి సాయంత్రం 8 గంటల వరకు పనిచేస్తుందని పేర్కొన్నారు. ఆస్తి పన్నుదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని జివిఎంసి అభివృద్ధికి సహకరించాలని కోరారు. 2025-26 ఆర్థిక సంవత్సర చెల్లింపు చేస్తే 5 శాతం రాయితీ ఉందని తెలిపారు.

చలివేంద్రాల ఏర్పాటు

ప్రజాశక్తి - ఆరిలోవ : వేసవి నేపథ్యంలో పాదచారులు, ప్రయాణికులు, వాహనదారుల దాహార్తిని తీర్చేందుకు జివిఎంసి ఆధ్వర్యాన 10, 11, 12, 13 వార్డుల్లోని ముఖ్యమైన కూడళ్లలో ఐదు చలివేంద్రాలు ఏర్పాటు చేశారు. తాటి ఆకుల కమ్మలతో చలువ పందిర్లు వేసి మట్టి కుండలను ఏర్పాటుచేశారు. 10వ వార్డు పరిధి వివేకానందనగర్ పార్కు సమీపంలో ఒకటి, పెదగదిలి కూడలి విమ్స్ గోడను ఆనుకొని ఒకటి, 11వ వార్డు పరిధి అంబేద్కర్ విగ్రహం కూడలి వద్ద, జివిఎంసి ఎఫ్ఆర్‌యు ఆసుపత్రి వద్ద, 13వ వార్డు పరిధి ఆరిలోవ కాలనీ చివరి బస్టాపు వద్ద చలివేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈ కేంద్రాలను శుక్రవారం జివిఎంసి సూపరింటెండెంట్ ఇంజినీరు కృష్ణారావు, ఎఇ వెంకటరావు తనిఖీ చేశారు. జనసంచారం ఎక్కువగా ఉండే ఆరిలోవ టిబిసి పాయింట్, దుర్గాబజార్, చినగదిలి సాయిబాబా టెంపుల్ ప్రాంతాల్లో కూడా ఏర్పాటు చేస్తే మంచిదని స్థానికులు అంటున్నారు.



చలివేంద్రాన్ని పరిశీలిస్తున్న జివిఎంసి సూపరింటెండెంట్ ఇంజినీరు కృష్ణారావు, ఎఇ వెంకటరావు

రోడ్లపైనే వాహన మరమ్మతులు

- ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం
- చోద్యం చూస్తున్న పోలీసులు


నిలిచిపోతున్న వాహనాలు

ప్రజాశక్తి -ఆనందపురం : ఆనందపురం -తగరపువలస సర్వీస్ రోడ్డులో పెద్దిపాలెం పారడైజ్ హోటల్ ఎదురుగా సర్వీస్ రోడ్డులో వాహనాలను నిలిపివేస్తుండటంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలుగుతోంది. రోడ్డు పక్కన రెండు మెకానిక్ షాపులు ఉన్నాయి. ఇక్కడికి వచ్చిన వాహనాలను రోడ్డుపై పెట్టి మరమ్మతులు చేస్తుండటంతో ఎదురెదురుగా వస్తున్న వాహనాలు తప్పించుకోవడానికి వీలు లేక ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలుగుతోంది. నిత్యం రద్దీగా ఉండే ఈ రోడ్డులో మెకానిక్ షెడ్ల వల్ల పలు ఇబ్బందులు తలెత్తుతున్నాయని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ పరిసర ప్రాంతంలో పోలీసుల వాహనం ఉన్నా ట్రాఫిక్ నివారణ చర్యలు చేపట్టడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా పోలీసులు పరిశీలించి రోడ్డుపై వాహనాలను నిలిపి మరమ్మతులు చేపట్టకుండా చర్యలు చేపట్టాలని వాహనదారులు, స్థానికులు కోరుతున్నారు.



పరీక్షా కేంద్రం వద్ద నిరసన తెలుపుతున్న నిరుద్యోగులు

పరీక్షా కేంద్రం వద్ద నిరసన

ప్రజాశక్తి- పెందుర్తి : జివిఎంసి 97వ పరిధి సుజాతనగర్ సమీపంలో ఉన్న హెగ్జాన్ ఆన్‌లైన్ పరీక్షా కేంద్రంలో పలువురికి ఇన్విజిలేటర్ జవాబులు అందించారంటూ శుక్రవారం అభ్యర్థులు నిరసన తెలిపారు. విద్యార్థుల జీవితంతో చెలగాటమాడుతున్న ఇటువంటి కేంద్రాలను వెంటనే మూసివేయాలని నినదించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ, బిహెచ్ఇఎల్‌లో ఉద్యోగాల నిమిత్తం ఆన్‌లైన్‌లో పరీక్ష జరిగిందని, ఈ పరీక్షకు హెగ్జాన్‌ను కేంద్రంగా ఇచ్చినట్లు తెలిపారు. పరీక్ష రాస్తున్న సమయంలో ఇద్దరు విద్యార్థులకు కేంద్రంలోని ఇన్విజిలేటరు జవాబులు ఒక కాగితం రాసి అందించారని ఆరోపించారు. హెగ్జాన్ సెంటర్‌కు మరెప్పుడు పరీక్షా కేంద్రంగా ఇవ్వొద్దని విజ్ఞప్తిచేశారు. ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు. సమాచారం తెలుసుకొని పోలీసులు కేంద్రం వద్దకు చేరుకున్నారు. సిసి ఫుటేజీలను పరిశీలిస్తున్నారు.

సమాజాభివృద్ధికి సేవలు

ప్రజాశక్తి-సీతమ్మధార : సమాజాభివృద్ధి కోసం ప్రజాపిత బ్రహ్మకుమారీలు అందిస్తున్న సేవలు ప్రశంసనీయమని ఏపీ ఈపీడీసీఎల్ విశ్రాంత ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ బి.రమేష్‌ప్రసాద్ కొనియాడారు. బాలయ్యశాస్త్రిలేవుట్‌లోని సింధూర గెస్ట్ హౌస్‌లో జర్నలిస్టులు ఒత్తిడిని అధిగమించేందుకు బ్రహ్మకుమారీల ఆధ్వర్యాన సెమినార్ నిర్వహించారు. ముందుగా ఇటీవల మృతిచెందిన బ్రహ్మకుమారీస్ గ్లోబల్ సెంటర్ల చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ హెడ్ దాదీ రతన్ మోహినీకి నివాళులర్పించారు. అనంతరం రమేష్‌ప్రసాద్ మాట్లాడుతూ, జర్నలిస్టులకు ఇటువంటి సెమినార్లు నిర్వహించడం ఎంతో ఉపయుక్తమన్నారు. మాజీ డిప్యూటీ మేయర్ దాడి సత్యనారాయణ మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ తమ దైనందిన జీవితంలో భాగంగా ఎంతో కొంత మందికి తగిన సాయం చేయాలన్నారు. జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి గంట్ల శ్రీనుబాబు మాట్లాడుతూ, జర్నలిస్టుల సంక్షేమానికి తమ వంతు కృషి చేస్తునే ఉన్నామన్నారు. కార్యక్రమ నిర్వాహకులు బికె రామేశ్వరి మాట్లాడుతూ, రాజయోగ మెడిటేషన్ ద్వారా జర్నలిస్టులు ఒత్తిడిని అధిగమించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ పాత్రికేయులు ఆర్.నాగరాజు పట్నాయక్, శాంతినగర్ శాఖ నిర్వాహకులు లలిత పాల్గొన్నారు.



యుజిడి పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ కన్నా తదితరులు

యుజిడి పనుల పరిశీలన

ప్రజాశక్తి-వేపగుంట : జివిఎంసి 93వ వార్డు పరిధి సమతా కాలనీలో రూ.47 లక్షలతో జరుగుతున్న అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ (యుజిడి) పనులను స్థానిక కార్పొరేటర్ రాపర్తి కన్నా శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈ పనుల వల్ల గత 20 సంవత్సరాలుగా సమతా కాలనీలో మురుగు నీరు పోయే మార్గం లేని సమస్యకు పరిష్కారం దొరుకుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎఇ రాజశేఖర్, కాంట్రాక్టర్ శివారెడ్డి, సూపర్‌వైజర్ నక్క అప్పారావు, ఇంజినీర్ వినయ్, ఎర్ర ఈశ్వరరావు, మాజీ ఉపసర్పంచ్ జి.మహేష్, స్థానికులు సత్యనారాయణ పాల్గొన్నారు.

జాతీయ స్థాయి పోటీల్లో రాణించాలి

ప్రజాశక్తి -పాడేరు : ఈ నెల 20 నుండి 22వ తేదీ వరకు రాజస్థాన్ రాష్ట్రం కోటలో జరుగనున్న కుస్తీ పోటీలకు జిల్లా నుండి ఎంపికైన 16 మంది విద్యార్థులు జిల్లా కలెక్టర్ ఎఎస్ దినేష్ కుమార్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. శుక్రవారం ఐటిడిఎలో జరిగిన మీ కోసం కార్యక్రమం అనంతరం కొయ్యూరు గిరిజన ఆశ్రమ పాఠశాల పిడిలు నూకరాజు, సింహాచలం ఆధ్వర్యంలో జరిగిన రాష్ట్ర స్థాయి కుస్తీ పోటీలలో 16 బంగారం, రెండు కాంస్య పతకాలను సాధించి పతకాలను పొందారు.

బకాయి జీతాలు చెల్లించాలని

సినర్జీస్ కార్మికుల ధర్నా

ప్రజాశక్తి -గాజువాక : ఐదు నెలల బకాయి జీతాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ కంపెనీ గేటు వద్ద సినర్జీస్ కార్మికులు శుక్రవారం ధర్నా చేశారు. ఈ ధర్నానుద్దేశించి సినర్జీస్ ఎంప్లాయిస్ యూనియన్ గౌరవాధ్యక్షులు ఎం.రాంబాబు మాట్లాడుతూ, ఐదు నెలల జీతాలు బకాయి ఉంటే కార్మికులు ఎలా జీవనం సాగిస్తారని ప్రశ్నించారు. జీతాలు లేక పిల్లలకు స్కూల్ ఫీజు కట్టలేకపోతున్నారని తెలిపారు. అనారోగ్యం వస్తే ఆసుపత్రికి వెళ్లలేక, పిల్లలకు రెండు పూటలైనా తిండి పెట్టలేక కార్మికులు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఐదు నెలలుగా జీతాలివ్వకుంటే లేబర్ కార్యాలయం అధికారులు ఏమి చేస్తున్నారని ప్రశ్నించారు. కార్మికులతో పని చేయిస్తూ ఉత్పత్తి తీయించుకుంటున్నారని, జీతాలు ఇవ్వమంటే డబ్బులు లేవంటున్నారని తెలిపారు. జీతాలు చెల్లించేవరకూ పోరాటం కొనసాగుతుందని స్పష్టంచేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు గోవింద్, బషీర్, దాస్, శ్రీనివాస్‌నాయుడు పాల్గొన్నారు.



నినదిస్తున్న రాంబాబు, సినర్జీస్ కార్మికులు

విశాఖ విమల విద్యాలయంలో అడ్మిషన్లు ప్రారంభించాలి

కలెక్టర్‌ను కలిసిన ఎమ్మెల్యే పల్లా, ఉపాధ్యాయులు



కలెక్టర్‌తో చర్చిస్తున్న ఎమ్మెల్యే పల్లా, పాఠశాల ఉపాధ్యాయులు

ప్రజాశక్తి -గాజువాక : ఉక్కునగరంలో ఉన్న విశాఖ విమల విద్యాలయంలో ఈ ఏడాది అడ్మిషన్లు, పాఠశాల ఒప్పంద పునరుద్ధరణపై జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిరప్రసాద్‌తో గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, పాఠశాల ఉపాధ్యాయ, ఉపాధ్యాయేతర సిబ్బంది శుక్రవారం చర్చించారు. జిల్లా విద్యాశాఖాధికారి, ఆర్‌సిఎం అధికారులతో చర్చించి అడ్మిషన్లు వెంటనే ప్రారంభించుటకు, ఒప్పంద పునరుద్ధరణకు తగు చర్యలు తీసుకోవాలని కోరుతూ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. వినతిపత్రాన్ని పరిశీలించిన కలెక్టర్ స్పందిస్తూ తగుచర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారని పాఠశాల సిబ్బంది తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయుల సంఘం ప్రధాన కార్యదర్శి బి.సత్యనారాయణ, కార్యదర్శులు అనిత, సూర్యప్రతాప్, బోధన, బోధనేతర సిబ్బంది రవిచంద్, రవిమోహన్, విజయకుమార్, భాస్కర్, శ్రీనివాసరావు, రవీంద్రమణి, రెజీనా పాల్గొన్నారు.

వక్ఫ్ సవరణలపై నిరసనలు

ప్రజాశక్తి- యంత్రాంగం

గాజువాక : కొత్త వక్ఫ్ చట్టాన్ని వ్యతిరేకిస్తూ గాజువాక మైనార్టీస్ యునైటెడ్ ఫ్రంట్ ఆధ్వర్యాన గాజువాకలో నిరసన తెలిపారు. అన్ని మసీదుల్లో శుక్రవారం ప్రార్థనల అనంతరం శాంతియుతంగా నిరసన తెలియజేశారు. హం సబ్ ఏకే హై హమారా ఆవాజ్ ఏక్ హై అంటూ నినాదాలు చేశారు. ఈ చట్టం వల్ల ముస్లిములకు తీరని అన్యాయం జరుగుతుందని, తక్షణమే ఉపసంహరించాలని కోరారు. లేకుంటే నిరసన కార్యక్రమాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సుమారు 25 మసీదుల నుంచి ముస్లిం సోదరులు పాల్గొన్నారు.



కోటవురట్ల మండల కేంద్రంలో నిరసన తెలుపుతున్న ముస్లిములు

కోటవురట్ల:వక్ఫ్ సవరణ బిల్లు లోపాలను సరి చేయాలని శనివారం మండల కేంద్రంలో మక్కా మసీదు వద్ద ముస్లిం సోదరులు నిరసన చేపట్టారు. దేశవ్యాప్తంగా అనేక రాష్ట్రాల్లో ఈ బిల్లును వ్యతిరేకిస్తున్నా కేంద్ర ప్రభుత్వం ఉభయ సభలోలనూ ఆమోదం తెలపడం రాజ్యాంగ విరుద్ధమని తెలిపారు. ముస్లిం మత పెద్దలు కాసిం, పాప సాహెబ్, అబ్దుల్లా, ఇస్మాయిల్ తదితరులు పాల్గొన్నారు.

కౌసల్య తనయ రాఘవ చిత్ర యూనిట్ సందడి

ప్రజాశక్తి -గాజువాక : కౌసల్య తనయ రాఘవ సినిమా నటీనటులు గాజువాకలోని మోహిని థియేటర్ వద్ద శుక్రవారం సందడి చేశారు. ఈ సందర్భంగా చిత్ర దర్శకుడు స్వామి పట్నాయక్ మాట్లాడుతూ, ఈ చిత్రాన్ని రెండు తెలుగు రాష్ట్రాల్లో 30 థియేటర్లో విడుదల చేశామని తెలిపారు. ఈ సినిమా నిర్మాణ సమయంలో సహకరించిన కుటుంబ సభ్యులకు, ప్రతి ఒక్కరికీ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నిర్మాత అడపా రత్నాకర్, హీరో రాజేష్ కొంజాడ, హీరోయిన్ శ్రావణిశెట్టి, నటీనటులు పాల్గొన్నారు.

సాక్షి ఎడిటర్, జర్నలిస్టులపై కేసులు ఎత్తివేయాలి

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : సాక్షి దినపత్రిక సంపాదకులు ధనుంజయరెడ్డితో పాటు పల్నాడు జిల్లాకు చెందిన ఆరుగురు జర్నలిస్టులపై అక్రమంగా పెట్టిన కేసులను ఎత్తివేయాలని ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి గంట్ల శ్రీనుబాబు, విశాఖపట్నం జిల్లా అధ్యక్షులు పోతుమహంతి నారాయణ్, కార్యదర్శి జి. శ్రీనివాసరావు, డిప్యూటీ జనరల్ సెక్రెటరీ ఎ.సాంబశివరావు, ఆర్గనైజింగ్ సెక్రెటరీలు డి.రవికుమార్, పిఎస్.ప్రసాద్, కోశాధికారి బి.సీతారామమూర్తి, ఆంధ్రప్రదేశ్ బ్రాడ్ కాస్టింగ్ జర్నలిస్ట్ అసోసియేషన్ అధ్యక్షులు ఇరోతి ఈశ్వరరావు, కార్యదర్శి కింతాడ మదన్, ఏపి స్మాల్ అండ్ మీడియం పేపర్స్ అసోసియేషన్ అధ్యక్షులు జగన్మోహన్‌రావు, కార్యదర్శి శ్రీనివాసరావు ఒక ప్రకటనలో ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. మాచర్ల మండలంలో జరిగిన పి.హరిశ్చంద్ర హత్య కేసు ప్రచురణ వార్త కారణంగా సమాజంలో వైషమ్యాలు పెచ్చరిల్లుతాయనే సాకుతో కేసు బనాయించటం అక్రమమని, హంతకులను పట్టుకుని శిక్షించాల్సిన పోలీసులు ఆ పనికి బదులుగా, ఇటువంటి కేసులు బనాయించటం ఎంత మాత్రం సమంజసం కాదని పేర్కొన్నారు. మీడియాను, జర్నలిస్టులను భయభ్రాంతులకు గురిచేసే వైఖరిని పోలీసులు అనుసరించటం సరికాదని పేర్కొన్నారు. నేరానికి బాధ్యులైన వారిని శిక్షించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని, అదే సమయంలో సరైన సమాచారం నిష్పాక్షికంగా అందించే ఖచ్చితమైన వ్యవస్థ ఏర్పాటుచేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. సాక్షి దినపత్రికలో పనిచేస్తున్న సంపాదకులు ధనుంజయరెడ్డి, ఇతర జర్నలిస్టులపై పెట్టిన కేసులను తక్షణమే ఎత్తివేయాలని డిమాండ్ చేశారు.

బిసి కార్పొరేషన్ ద్వారా మహిళలకు రుణాలు

ప్రజాశక్తి-పాడేరు: ఆడపిల్లలకు విద్య చాలా అవసరమని, ఆర్థిక అసమానతల్లో తేడాలు లేకుండా ఎదగాలంటే చిన్నతనం నుండే చదువు ప్రారంభించాలని జిల్లా కలెక్టర్ ఎఎస్ దినేష్ కుమార్ తెలిపారు. మహిళలు ఆర్థికంగా ఎదిగి రాబోయే తరానికి ఆదర్శంగా ఉండాలని సూచించారు. మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి పురస్కరించుకుని శుక్రవారం ఐటిడిఏలో జరిగిన ఒక కార్యక్రమంలో బీసీ కార్పొరేషన్, కాపు కార్పొరేషన్, ఈడబ్ల్యూఎస్ కార్పొరేషన్ల ద్వారా స్వయం ఉపాధి కింద 50శాతం బ్యాంకు రుణము, 50శాతం ప్రభుత్వం సబ్సిడీతో 150 యూనిట్లకు గాను 150 మంది మహిళా లబ్దిదారులకు నాలుగు కోట్ల రూపాయల చెక్కును కలెక్టర్ అందజేశారు.

క్లీనింగ్ పనులు చేస్తూ కుప్పకూలిన కార్మికుడు

- ఆసుపత్రికి తరలించేలోగా మార్గమధ్యలో మృతి
- గ్లాండ్ ఫార్మా కంపెనీలో సంఘటన

ప్రజాశక్తి - పరవాడ

పరవాడ ఫార్మా సిటీలోని గ్లాండ్ ఫార్మా పరిశ్రమలలో కాంట్రాక్టర్ కార్మికుడు బవిరిశెట్టి నాగేశ్వరరావు (52) శుక్రవారం క్లీనింగ్ మిషన్‌తో క్లీనింగ్ పనులు చేస్తూ కుప్పకూలిపోయాడు. ఈ విషయం తెలుసుకున్న యాజమాన్యం వెంటనే స్పందించి హాస్పిటల్ తరలించగా మార్గమధ్యలో మృతి చెందాడు. అనకాపల్లి మండలం తుంపాల గ్రామానికి చెందిన నాగేశ్వరరావు పరిశ్రమలో గత మూడు సంవత్సరాలుగా పనిచేస్తున్నాడు. విషయం తెలుసుకున్న ఫార్మాసిటీ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ గౌరవ అధ్యక్షులు గనిశెట్టి సత్యనారాయణ పరిశ్రమ వద్దకు చేరుకొని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఈ సంఘటనపై సమగ్ర విచారణ చేసి కార్మిక కుటుంబం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ప్రతి ఆరు నెలలకు ఒకసారి ఫార్మా పరిశ్రమల్లో కార్మికులకు వైద్య పరీక్షలు నిర్వహించాలని కోరారు. కార్మికుల రక్షణ భద్రత సంక్షేమాన్ని యాజమాన్యాలు నిత్యం పర్యవేక్షించాలన్నారు. మృతుని కుటుంబాన్ని ఆదుకోవడానికి ప్రభుత్వం, యాజమాన్యం వెంటనే చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కోశాధికారి వివి శ్రీనివాసరావు, నాయకులు టి మల్లేశ్వరరావు, కె.కృష్ణ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సిఐటియు నేత గనిశెట్టి సత్యనారాయణ

పాఠశాలల పునర్వ్యవస్థీకరణ ఆపాలని వినతి

ప్రజాశక్తి-అనకాపల్లి : పాఠశాల విద్యాశాఖ చేపడుతున్న పాఠశాలల పునర్వ్యవస్థీకరణ, సంస్కరణల దుష్ప్రభావాన్ని అరికట్టాలని కోరుతూ శుక్రవారం యుటిఎఫ్ జిల్లా నాయకులు ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి గొంది చిన్నబ్బాయ్ మాట్లాడుతూ పాఠశాలల కుదింపు వలన నష్టపోతున్నామని, ఉపాధ్యాయ పోస్టులు కుదింపుకు గురవుతున్నాయని తెలిపారు. ఒక పంచాయతీలో ఎన్ని పాఠశాలలుంటే అన్ని పాఠశాలలను ప్రాథమిక పాఠశాలలుగా కొనసాగిస్తూ 40 మంది కంటే ఎక్కువ విద్యార్థులు ఉన్న పాఠశాలలను మోడల్ ప్రైమరీ పాఠశాలలుగా ఉంచాలని విజ్ఞప్తి చేశారు. 75 మంది విద్యార్థులు కంటే తక్కువ ఉన్న ఉన్నత పాఠశాలలలో హెచ్‌ఎం, పిడి పోస్టులను ప్రభుత్వం తొలగించడం సరికాదన్నారు. ఐదు కిలోమీటర్ల పరిధిలో హైస్కూల్ లేని యూపీ పాఠశాలలను డౌన్ గ్రేడ్ చేయకుండా, యూపీ పాఠశాలలుగానే కొనసాగించాలని కోరారు. బేసిక్ ప్రైమరీ పాఠశాలలో కనీసం ఇద్దరు ఉపాధ్యాయులు ఉండేలాగా చూడాలని విజ్ఞప్తి చేశారు. పంచాయతీలలో ఉన్న ప్రతి ప్రాథమిక పాఠశాలను మోడల్ ప్రైమరీగానే కొనసాగించాలని, పిల్లల సంఖ్యతో సంబంధం లేకుండా, ఐదు తరగతులకు కనీసం ఐదుగురు ఉపాధ్యాయులు ఉండాలని కోరారు. దీనికి స్పందించి ఎమ్మెల్యే విజ్ఞాపన పత్రాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు వత్సవాయి శ్రీలక్ష్మి, సహాధ్యక్షులు రొంగలి అక్కు నాయుడు, నాయకులు నాతవరపు సతీష్, కృష్ణకిషోర్, రవి, ఆశ, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

గండి రవికుమార్‌ను కలిసిన పైడివాడ నాయకులు

ప్రజాశక్తి-సబ్బవరం : మండలంలోని పైడివాడ గ్రామ సర్పంచ్ వడ్డాది అప్పలరాజు, నూతనంగా ఎన్నికైన ఉప సర్పంచ్ సూరిబాబు, మాజీ ఉప సర్పంచ్ కొండబాబు, గ్రామ వైసిపి నాయకులు శుక్రవారం పెందుర్తి నియోజవర్గం పార్టీ నాయకులు గండి రవికుమార్ ని ఆయన కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. నూతనంగా ఎన్నికైన నేతలకు దుశాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలియజేసారు. గ్రామంలో వైస్సార్సీపీ బలోపేతానికి పని చేయాలని సూచించారు.

రేషన్ డిపోల్లో కందిపప్పును పునరుద్ధరించాలి : సిపిఎం

ప్రజాశక్తి-అనకాపల్లి : జిల్లాలోని రేషన్ కార్డు లబ్ధిదారులకు గత మూడు నెలలుగా కందిపప్పు పంపిణీ చేయడంలేదని, తక్షణమే కందిపప్పు పంపిణీ చేయాలని సిపిఎం అనకాపల్లి జిల్లా కార్యదర్శి జి.కోటేశ్వరరావు శుక్రవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. బయట మార్కెట్లో కేజీ కందిపప్పు రూ.160 నుండి 170కు విక్రయించడంతో పేదలు కొనుగోలు చేయలేకపోతున్నారని తెలిపారు. ప్రభుత్వం కందిపప్పు పంపిణీ చేయకపోవడంతో పేదలు పోషకాహారానికి దూరమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తమది మంచి ప్రభుత్వమని చెప్పుకుంటున్న కూటమి మంత్రులు, ఎమ్మెల్యేలు, నేతలు 3 నెలలకు పైగా కందిపప్పు పంపిణీ జరగకున్నా కనీసం స్పందించకపోవడం అన్యాయమన్నారు. ఇప్పటికే ఇంటి అద్దెలు, పిల్లల చదువులు, నిత్యావసరసరుకులు, గ్యాసు ధరలు పెరగడంతో ప్రజలు ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. పెరుగుతున్న ధరలను ప్రభుత్వం పరిగణలోకి తీసుకొని రేషన్ డిపోల ద్వారా నిత్యావసర సరుకులు సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. కేరళలో సిపిఎం వామపక్ష ప్రభుత్వం 14 రకాల నిత్యావసర సరుకులను ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా ప్రజలకు అందిస్తోందని పేర్కొన్నారు. ఆ తరహాలో రాష్ట్రంలో కూడా రేషన్ డిపోల ద్వారా నిత్యావసర సరుకులు సరఫరా చేసి పేదలను ఆదుకోవాలని కోరారు.

జగదాంబ క్వారీపై ఇపిడిసిఎల్ ఫిర్యాదు

ప్రజాశక్తి-అనకాపల్లి : అనకాపల్లి మండలం ఊడేరు రెవెన్యూ గ్రామ పరిధిలో ఉన్న జగదాంబ క్వారీపై అక్రమంగా విద్యుత్తు వైర్లను మట్టితో కప్పడం, ఆ వైర్లు తగిలి మేకలు చనిపోవడానికి కారకులు కావడంతో శుక్రవారం వారిపై ఈపీడీసీఎల్ కసింకోట డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎస్ రామకృష్ణ అనకాపల్లి రూరల్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. తమకు సమాచారం ఇవ్వకుండా, నిర్లక్ష్యంగా వ్యవహరించిన క్వారీ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నారు. కాగా విశాఖ జిల్లా గొర్రెల మేకల పెంపకందారుల సహకార యూనియన్ చైర్మన్ గంటా శ్రీరామ్ నేతృత్వంలో క్వారీ యాజమాన్యం అక్రమ చర్యలు చేపట్టిన ప్రాంతాన్ని పరిశీలించడం, ప్రజాశక్తి దినపత్రికలో శుక్రవారం వార్త ప్రచురణ కావడంతో స్పందించిన విద్యుత్ శాఖ ఉద్యోగులు ఈ మేరకు చర్యలు తీసుకున్నారు. విద్యుత్ శాఖ అనుమతులు లేకుండా కింద ఎటువంటి నిర్మాణాలు చేపట్టరాదని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

మండల సమన్వయ కమిటీ సమావేశం

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట : స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో శుక్రవారం మండల లెవెల్ కోఆర్డినేషన్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఆర్.భీమవరం, పెదపూడి అగ్రహారం గ్రామాల నుండి ఇటీవల గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేసుకున్న ఇరు వర్గాలతో సమావేశమయ్యారు. వారు సమర్పించిన అర్జీలకు సంబంధించిన డాక్యుమెంట్లను పరిశీలించారు. సమస్య పరిష్కారానికి ఇరు వర్గాలతో మాట్లాడారు. ఈ సమావేశంలో ఎంపీడీవో వి విజయలక్ష్మి, అడిషనల్ ఎస్సై ఎన్ భాస్కరరావు, డీటి మురళీధర్, పాల్గొన్నారు.

ఆడపిల్లల రక్షణకు దిశ బృందాలు

ప్రజాశక్తి-అనకాపల్లి : ఆడపిల్లల రక్షణకు దిశ టీములు ఏర్పాటు చేసినట్టు ఎస్సై ఎస్.మణికుమారి తెలిపారు. మండలంలోని తుమ్మపాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం ప్రధానోపాధ్యాయులు శంకర్రావు ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గుడ్ టచ్ బ్యాడ్ బ్యాడ్ టచ్, మగ పిల్లల హెయిర్ స్టైల్, ఆడపిల్ల రక్షణకు దిశా టీముల ప్రత్యేక బాధ్యతలు వివరించారు. ఈ కార్యక్రమంలో స్కూల్ కమిటీ చైర్మన్ పి బలరాం, కానిస్టేబుల్ పుష్పలత, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

పయనీరు కార్మికుల పోరాట విజయం

యాజమాన్యం దిగొచ్చి డిమాండ్లకు అంగీకారం


కంపెనీ వద్ద ఆందోళన చేస్తున్న కార్మికులు

ప్రజాశక్తి అచ్యుతాపురం : అచ్యుతాపురం ఎస్ఈజెడ్‌లోని బ్రాండిక్స్ ఆవరణలో పయనీర్ పరిశ్రమ కార్మికులు నాలుగు రోజులు పోరాటం చేసి తమ డిమాండ్లను సాధించుకున్నారు. శుక్రవారం మధ్యాహ్నం యాజమాన్యంతో చర్చలు జరిగాయి. కార్మికులు అడిగిన సమస్యలను పరిష్కరించడానికి యాజమాన్యం అంగీకరించింది. నాలుగు రోజుల క్రితం వేతనాలు పెంచాలని, బోనస్ చెల్లించాలని యాజమాన్యం వేధింపులు, టెక్నీషియన్స్ వేధింపులు ఆపాలని, ఇంక్రిమెంట్లు వేయాలని, నైట్ షిఫ్ట్ అలవెన్స్ చెల్లించాలని తదితర డిమాండ్లతో మంగళవారం పరిశ్రమ ఆవరణలో సమ్మె ప్రారంభించిన విషయం విధితమే. నాలుగు రోజులుగా విధులకు హాజరు కాకుండా సమ్మె కొనసాగించారు. ఎట్టకేలకు యాజమాన్యం కార్మికులతో చర్చలు జరిపి నైట్ షిఫ్ట్ అలవెన్స్ వంద రూపాయలకు పెంచారు. బ్రాండిక్స్‌లో ఇస్తున్నట్టుగా బోనస్ చెల్లించడానికి, కార్మికులకు టైం విరామం తీసుకోవడానికి బ్రేక్ టైం కల్పించడానికి, అటెండెన్స్ వెయ్యి రూపాయలు, ప్రతి సంవత్సరం ఇంక్రిమెంట్, నాలుగు నెల ఎరియర్స్ ఇవ్వడానికి పరిశ్రమ యాజమాన్యం అంగీకరించింది. దీంతో శుక్రవారం బి షిఫ్ట్ నుండి కార్మికులు విధులకు కార్మికులు హాజరయ్యారు.

కార్మికుల ఐక్య పోరాటానికి అభినందనలు : సిఐటియు

పయనీరు కార్మికులు నాలుగు రోజులుగా చేస్తున్న సమ్మె చేసి తమ డిమాండ్లను సాధించుకోవడంపై సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఆర్.రాము అభినందనలు తెలిపారు. సమస్యల పరిష్కారానికి ఐక్య పోరాటంతో సాధించవచ్చని పయనీరు కార్మికులు రుజువు వేశారని పేర్కొన్నారు.

ఈదురుగాలుల బీభత్సానికి తీవ్ర నష్టం

ప్రజాశక్తి-దేవరాపల్లి : గురువారం రాత్రి కురిసిన వర్షం, ఈదురుగాలుల బీభత్సానికి మండలంలోని తిమిరాం గ్రామంలో అగర్ వుడ్, అరటి తోటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. తిమిరాం గ్రామానికి చెందిన రెడ్డి సింహాద్రప్పుడు ఏడు ఎకరాల్లో వేసిన అత్యంత ఖరీదైన అగర్ వుడ్ ఐదు సంవత్సరాల వయస్సు గల చెట్లు, అందులో అంతర్ పంటగా వేసిన అరటి మొక్కలు, కామిరెడ్డి శ్రీరాములుకు చెందిన 2 ఎకరాల్లో అగరు వుడ్, అరటి తోట ఈదురుగాలులకు నేలకొరిగాయి. దీని వల్ల తనకు సుమారు 10 లక్షల రూపాయలు ఆస్తి నష్టం సంభవించిందని బాధిత రైతు సింహాద్రప్పుడు ఆవేదన వ్యక్తం చేశాడు. 7 ఎకరాల్లో అగర్ వుడ్ మొక్కలు ఐదువేలు, అందులో అంతర పంటగా 5 వేల అరటి మొక్కలు వేశానని తెలిపారు. పంట చేతికి అందే సమయానికి మొత్తం అరటి చెట్లు, ఐదు సంవత్సరాలు పెరిగిన అగర్ వుడ్ చెట్లు సుమారు 1500 వరకు ఈదురుగాలులకు నేలకొరిగిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఆ చెట్లను మళ్లీ నిలబెట్టినా బతికే అవకాశం లేదన్నారు. అగరు వుడ్ చెట్లు 10 సంవత్సరాలు దాటితే లక్షల్లో ఆదాయం వస్తుందని, అధిక మొత్తంలో పెట్టుబడి పెట్టి సంరక్షిస్తున్నానని ఇద్దరు రైతులు తెలిపారు. తమకు జరిగిన నష్టాన్ని ప్రభుత్వం పరిశీలన చేసి నష్టపరిహారం చెల్లించాలని వారు కోరారు. ఈ సమాచారాన్ని హార్టికల్చర్ అధికారులకు ఫోన్ ద్వారా తెలియజేసినా అధికారులు సకాలంలో స్పందించలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నేల కొరిగిన అరటి తోటలు

ప్రజాశక్తి-నాతవరం: మండలంలోని చమ్మచింత, వలసంపేట గ్రామాలలో కురిసిన వర్షాలకు అరటి తోటలు నేల కొరిగాయి. గ్రామానికి చెందిన రైతులు అప్పన శ్రీను, అప్పన రమణ, అప్పన నూకరాజు, దేవారపు వెంకట నాగేశ్వరరావు, బంటుపల్లి నానాజీ, మైనం బాబ్జి తదితర రైతుల అరటి పంట ఈదురుగాలులతో కూడిన వర్షంతో నేల కొరిగాయి. దీంతో రైతులు లబోదిబోమన్నారు. అగ్రికల్చర్ అసిస్టెంట్లు నవీన్, రవితేజ పంటలను పరిశీలించారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారులకు తెలియజేస్తామని అన్నారు.


నేలకొరిగిన అగర్ వుడ్, అరటి తోటలు


నేల మట్టమయిన అరటి తోటలు

రవినాయుడును కలిసిన బుచ్చిరాజు

ప్రజాశక్తి-సబ్బవరం : ఏపి క్రీడ ప్రాధికార సంస్థ చైర్మన్ అనిమిని రవి నాయుడును విజయవాడలో తెలుగు యువత అనకాపల్లి పార్లమెంటు అధ్యక్షులు పిబివిఎస్ఎన్‌రాజు (బుచ్చిరాజు) శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసి, పుష్ప గుచ్ఛం ఇచ్చి ఘనంగా సత్కరించారు. రాష్ట్ర క్రీడాకారులను విశ్వవ్యాప్తంగా ప్రోత్సహించాలని కోరారు. కార్యక్రమంలో దొడ్డి సూర్య ప్రకాశరావు, ఉత్తర కుమార్, హరికృష్ణ, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

బిసిలకు చట్టసభలలో 52 శాతం రిజర్వేషన్ కల్పించాలి

ప్రజాశక్తి-అనకాపల్లి : బీసీలకు చట్టసభల్లో 52 శాతం రిజర్వేషన్లు కల్పించాలని కోరుతూ బహుజన సమాజ్ పార్టీ, బీసీ సమన్వయ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం అనకాపల్లి నెహ్రూ చౌక్ జంక్షన్లో బీసీ సమరభేరి నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ ఉత్తరాంధ్ర జిల్లాల ఇంచార్జ్ కరణం తిరుపతిరావు మాట్లాడుతూ బిసి కులాల నిజమైన అభివృద్ధి కోసం, సామాజిక ఆర్థిక రాజకీయ అభివృద్ధి కోసం బీసీ కుల జన గణన జరిగి తీరాలని డిమాండ్ చేశారు. బీఎస్పీ అనకాపల్లి జిల్లా అధ్యక్షులు బొట్టా నాగరాజు మాట్లాడుతూ బీసీ కులాల ప్రజలు తమ హక్కుల సాధన కోసం ఐక్యంగా ఉద్యమించాలన్నారు. కార్యక్రమంలో పార్టీ అనకాపల్లి ఇన్చార్జ్ సూదికొండ మాణిక్యాలరావు, బీసీ సమన్వయ కమిటీ కన్వీనర్ కోన లక్ష్మణ్, నాయకులు కోరిబిల్లి శంకరరావు, ఎస్‌వివి రామచంద్రరావు, వాయిబోయిన శేఖర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.


ధర్నా చేస్తున్న బిఎస్‌పి నాయకులు


క్యూబా సంఘీభావ నిధి సేకరిస్తున్న సిఐటియు నేతలు

క్యూబా సంఘీభావ నిధి సేకరణ

ప్రజాశక్తి-చోడవరం : క్యూబా దేశానికి సంఘీభావంగా సిఐటియు ఆధ్వర్యంలో శుక్రవారం చోడవరం సంఘీభావ నిధి సేకరించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కోశాధికారి వీవీ శ్రీనివాసరావు మాట్లాడుతూ అమెరికా సామ్రాజ్యవాద తీవ్ర ఆంక్షలతో విలవిలలాడుతున్న సోషలిస్టు క్యూబా దేశానికి సంఘీభావంగా అఖిలభారత క్యూబా సంఘీభావ కమిటీ పిలుపులో భాగంగా నిధి సేకరణ చేస్తున్నట్లు చెప్పారు. ఫిడెల్ కాస్ట్రో, చిగువేరాల నాయకత్వంలో ఏర్పడిన క్యూబా దేశంపై అమెరికా వివిధ రూపాల్లో ఆంక్షలు పెడుతుందని తెలిపారు. ఆ దేశంలో ప్రజలకు తిండి లేకుండా చేయాలని, పసిపిల్లలకు పాలపొడి, ఆహారం, మందులు వంటి అందకుండా చేయాలనే దురుద్దేశంతో పన్నుతున్న కుట్రలకు నిరసనగా భారత దేశంలోని కార్మిక వర్గం నుంచి ఈ సంఘీభావ నిధిని వసూలు చేసి క్యూబాకు పంపడం జరుగుతుందని చెప్పారు. చోడవరంలోని వివిధ కార్మికుల దగ్గర నుంచి సుమారు రూ.5000 సేకరించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకులు ప్రేమ్ చంద్రశేఖర్, వేపాడ సత్యనారాయణ, ఎస్వీ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఆటో బోల్తా పడి ఇద్దరికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి-దేవరాపల్లి : మండలంలోని తామరబ్బ దగ్గర శుక్రవారం సాయంత్రం ఆటో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో డ్రైవరుకు, ఒక మహిళకు తీవ్ర గాయాలు కాగా, పలువురు గాయపడ్డారు. ఈ ప్రమాదం జరిగిన సమయంలో ఆటోలో 20 మంది వరకు మహిళా ప్రయాణిస్తున్నారు. క్షతగాత్రులు తెలిపిన వివరాలు ప్రకారం... సమ్మెద సమీపంలో జీడిపిక్కలు ఏరడానికి రైవాడ గ్రామానికి చెందిన 20 మంది మహిళలు ప్రతి రోజూ కూలి పని కోసం ఆటోలో వెళ్లి వస్తున్నారు. శుక్రవారం సాయంత్రం కూలి పని ముగించుకుని ఇంటికి ఆటోలో బయలుదేరారు. తామరబ్బ వంతెన దాటిన తరువాత ప్రమాదకర మలుపులో అప్ ఎక్కలేక ఆటో అదుపు తప్పి వెనక్కు వెళ్లి రోడ్డు పక్కనున్న బండరాయిపై బోల్తా పడింది. స్థానికులు వెంటనే వారిని రక్షించి వేరొక ఆటోలో దేవరాపల్లికి పంపించారు. ఈ ప్రమాదంలో ఆటో డ్రైవరు కోరి అప్పలరాజు, శీర సింహాచలమ్మ చేతులు విరిగాయి. వంకల అప్పల నరస, మంగ, లక్ష్మి, దుక్క అప్పలనరస, నరసమ్మ, చిన్న, సన్యెమ్మ తదితరులు గాయపడ్డారు. క్షతగాత్రుల్ని దేవరాపల్లిలోని ప్రైవేటు ఆసుపత్రికి తీసుకొచ్చి వైద్యం చేయించారు.

వైసిపి నుండి జనసేనలో చేరిక

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట : మండలంలోని పెదమదీన, చినమదీన గ్రామాలకు చెందిన వైసిపి నాయకులు శుక్రవారం జనసేన పార్టీలో చేరారు. పెదమదీన సర్పంచ్ కొల్లిమళ్ల వెంకటరమణ, చిన మదీన గ్రామ సర్పంచ్ పచ్చికూర మంగావేణి, ఆమె భర్త గోవిందరావు, పెద మదీన ఉపసర్పంచ్ డి.పాపారావు, కో-ఆపరేటివ్ మాజీ డైరెక్టర్ కొల్లిమళ్ల మాణిక్యం, కుమ్మరి శాలివాహన సంఘ అధ్యక్షులు మాకవరపు లక్ష్మి, యాదవ సంఘం అధ్యక్షులు వియ్యపు గోవింద్, పెదమదీన వార్డు సభ్యులు అప్పారావు, జగదీష్, రామారావు, మహేష్, స్కూల్ కమిటీ మాజీ అధ్యక్షులు మహేష్, బుల్లిబాబుతో పాటు సుమారు 100 మంది జనసేన తీర్థం పుచ్చుకున్నారు. వారికి పార్టీ ఉమ్మడి విశాఖ జిల్లా అధ్యక్షులు, పెందుర్తి శాసన సభ్యులు పంచకర్ల రమేష్ బాబు, జనసేన చోడవరం నియోజకవర్గ ఇంచార్జి పివిఎస్ఎన్ రాజు జనసేన కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షులు డిఎస్ నాయుడు, ఉపాధ్యక్షులు తుమ్మపాల రమేష్, నాయకులు దాడి సూరి నాగేశ్వరరావు, దాడి గోవింద, మండపాక బాబురావు, కోరుకొండ సూరిఅప్పారావు, దొండా సాయి, పొలమరశెట్టి కృష్ణ, బుదిరెడ్డ అరుణ్, కొలిమల్ల నాగేశ్వరరావు, కొలిమల్ల శ్రీను, గంట్ల నరేష్, పాల్గొన్నారు.



పంచకర్ల సమక్షంలో జనసేనలో చేరిన వైసిపి నేతలు

విద్యుత్ స్మార్ట్ మీటర్లు పెట్టొద్దు

సిపిఎం ఆధ్వర్యాన ఇంటింటి ప్రచారం

ప్రజాశక్తి బుచ్చయ్యపేట

అదానీ లాంటి కార్పొరేట్ కంపెనీలకు లాభాలు చేకూర్చి, ప్రజలపై మరిన్ని భారాల మోపేందుకే ఉద్దేశించిన విద్యుత్తు స్మార్ట్ మీటర్లను పెట్టొద్దని సిపిఎం నాయకులు అన్నారు. స్మార్ట్ మీటర్లపై సిపిఎం నాయకులు మండల కేంద్రంలో బుచ్చయ్యపేటలో శుక్రవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కరపత్రాలు పంపిణీ చేసి, ఇళ్లకు పోస్టర్లు అంటించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు వివి శ్రీనివాసరావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే కరెంట్ చార్జీలు పెంచబోమని ఇచ్చిన హామీని తుంగలో తొక్కిందని నేడు ట్రూ అప్, సర్ చార్జీల పేరుతో రూ.15 వేల కోట్లకుపైగా భారం వేసిందని తెలిపారు. ఇది కాక స్మార్ట్ మీటర్ల పేరుతో ప్రతి ఇంటికీ రూ.10 వేలు భారాలు మోపడానికే ఈ స్మార్ట్ మీటర్లను బిగిస్తున్నారని చెప్పారు. ఈ స్మార్ట్ మీటర్లను ప్రజలందరూ తీవ్రంగా వ్యతిరేకించాలని, స్మార్ట్ మీటర్లు మాకొద్దు అనే నినాదంతో తిప్పి కొట్టాలని ప్రజలకు పిలుపునిచ్చారు. రాష్ట్రంలో విద్యుత్తు మొత్తం కార్పొరేట్ సంస్థలకు కట్టబెట్టి ప్రజలకు ఇచ్చే రాయితీలు, రైతులకు ఇచ్చే సబ్సిడీలను కోతలు పెట్టటానికి ప్రభుత్వాలు సిద్ధమవుతున్నాయని పేర్కొన్నారు. దీనిపై మండల వ్యాప్తంగా కరపత్రాలు, పోస్టర్లతో విస్తృతంగా ప్రజల్లో ప్రచారం నిర్వహించి భవిష్యత్తులో ప్రత్యేక పోరాటం నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు సాంబశివరావు, ఎస్వీ నాయుడు, శ్రీను, రాజు, రమణ, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలి

ఎపి భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నర్సింహారావు



మాట్లాడుతున్న సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నర్సింహారావు

ప్రజాశక్తి-అనకాపల్లి : భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని ఎపి భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్వి.నర్సింహారావు డిమాండ్ చేశారు. సంఘం జిల్లా కమిటీ సమావేశం శుక్రవారం స్థానిక దొడ్డి రాముసాయుడు భవనంలో జరిగింది. ఇందులో ముఖ్యఅతిథిగా పాల్గొన్న నర్సింగరావు మాట్లాడుతూ కార్మికులు పోరాడి సాధించుకున్న సంక్షేమ బోర్డులో ఉన్న వందల కోట్ల రూపాయలను గత రాష్ట్ర ప్రభుత్వం ఇతర సంక్షేమ పథకాలకు మళ్లించి, బోర్డును నిర్వీర్యం చేసిందన్నారు. తాము అధికారంలోకి రాగానే సంక్షేమ బోర్డు పునరుద్ధరణ చేస్తామని హామీ ఇచ్చి, అధికారంలోకి వచ్చి పది నెలలైనా హామీ నెరవేర్చలేదని పేర్కొన్నారు. దీంతో కార్మికులు ప్రమాదాల్లో మరణిస్తున్నా వారి కుటుంబాలను ఆదుకునే నాధుడు లేకుండా పోయారన్నారు. సంక్షేమ బోర్డు నిధులు చంద్రబాబు గతంలో అధికారంలో ఉన్నప్పుడు రూ.300 కోట్లు, తరువాత జగన్మోహన్ రెడ్డి రూ.800 కోట్లు ప్రభుత్వ పథకాలకు ఉపయోగించుకున్నారని తెలిపారు. ఆరు సంవత్సరాలుగా ఎటువంటి సంక్షేమ పథకాలు అమలు కాకుండా కార్మికులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ నేపథ్యంలో భవన నిర్మాణ కార్మికుల సమస్యలపై ఈ నెల 24న జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద జరుగు ధర్నాలో కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా గౌరవాధ్యక్షులు అడిగర్ల రాజు, అధ్యక్షులు కె.రామకృష్ణ, ప్రధాన కార్యదర్శి జి.అప్పారావు, నాయకులు అప్పలనాయుడు, త్రినాథ్, చిరంజీవి, శివ, తాతాజీ అప్పలరాజు పాల్గొన్నారు.

చెరువులో అక్రమంగా చెట్లు నరికివేత

- సాగునీటి సంఘం డైరెక్టర్లు, నాయకుల ఆరోపణ
- ఇరిగేషన్, రెవెన్యూ, అటవీశాఖలు పట్టించుకోలేదని ఆవేదన


చెరువు గర్భంలో నరికివేసిన చెట్లు

ప్రజాశక్తి-సబ్బవరం

మండలంలోని గొటివాడ రెవెన్యూ పరిధిలోని సర్వే నెంబర్ 16లో గల సూరపురాజు చెరువు గర్భంలో చెట్లను అక్రమంగా నరికి వేశారని సాగునీటి సంఘం డైరెక్టర్లు లగిశెట్టి సోమనాయుడు, లగిశెట్టి బంగారయ్య, ఉపసర్పంచ్ గొలజాన దుర్గాప్రసాద్, ఇరోతి రామారావు, బొండా కళ్యాణ రాజేలు ఆరోపించారు. ఈ మేరకు శుక్రవారం చెరువు గర్భంలోని చెట్ల నరికివేతపై సంఘటన స్థలంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. గొట్టివాడ రెవెన్యూ పరిధిలో సర్వేనెంబర్ 16లో సూరపురాజు చెరువు 42 ఎకరాల 32 సెంట్లు ఉందని, ఆ ప్రభుత్వ భూమిలో నేరేడు చెట్లు, నీలగిరి చెట్లు ఉన్నాయని తెలిపారు. సాగునీటి సంఘం అధ్యక్షులు, ఉపాధ్యక్షులు ఆయకట్టు రైతులకు, సాగునీటి సంఘం పాలకవర్గం సభ్యులకు తెలియకుండా విక్రయించి చెట్లను నరికించారని ఆరోపించారు. సూరపురాజు చెరువు సరిహద్దులను గుర్తించి చెరువు గర్భంలో చెట్లను నరికిన వారిపై ఎపి వాల్టా యాక్ట్ 2002, ఈజ్ మెంట్ యాక్ట్ ప్రసారం ప్రకారం చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. లక్షలు విలువైన కలపను సాగునీటి సంఘం అధ్యక్షుడు తమకు తెలియకుండా ఎలా అమ్మివేసారని ప్రశ్నించారు. తక్షణమే ఇరిగేషన్, రెవెన్యూ, అటవీశాఖ అధికారులు ఈ విషయమై తగు దర్యాప్తు చేసి అక్రమంగా చెట్లను నరికిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

ఈ విషయమై ఇరిగేషన్ సిబ్బంది శివ సంఘటన స్థలాన్ని పరిశీలించారు. ఉన్నత అధికారులకు నివేదిక త్వరలో పంపిస్తామని తెలిపారు. ఈ విషయమై గొట్టివాడ వీఆర్వో కౌసల్యారాయ్‌ను వివరణ కోరగా ప్రభుత్వ భూమి సర్వే నెంబర్ 16, ప్రైవేటు భూమి సర్వే నెంబర్ 13లు అక్కడ కలసి ఉండడంతో ప్రభుత్వ భూమిలో చెట్లు నరికేశారని, దీనిపై తాము తహశీల్దారుకు నివేదిక సమర్పించి, ఆయన ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ఈ విషయమై సాగునీటి సంఘం అధ్యక్షుడు సాలాపు సూరిబాబును వివరణ కోరగా తాము 2016లో సాగునీటి సంఘం అధ్యక్షుడిగా ఉన్నప్పుడు అధికారుల సమక్షంలో రెండు లక్షల 50 వేలకు సూరపురాజు చెరువు గర్భంలో చెట్లను వేలం వేయడం జరిగిందని, ఆరోజు ఒక వ్యక్తి కోర్టుకు వెళ్లి స్టేటస్కో ఆర్డర్ తీసుకురావడంతో వేలంపాట ఆగిందని తెలిపారు. అయితే ఆ డబ్బును అప్పుడే సాగునీటి సంఘం ప్రభుత్వ అకౌంట్లో జమ చేయడం జరిగిందని, ఇటీవల కోర్టు స్టేటస్కో ఆర్డర్‌ను డిస్మిస్ చేయడంతో ప్రస్తుతం వేలం పాట ఖరారయిన వ్యక్తే చెట్లను నరకడం జరిగిందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఇరోతి అచ్చం నాయుడు, లగిశెట్టి పెదఅప్పారావు, శ్రీను, ఇరోతి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన గోవాడ సుగర్స్ క్రషింగ్

ప్రజాశక్తి-చోడవరం : మండలంలోని గోవాడ చక్కర కర్మాగారంలో గురువారం అర్థరాత్రితో క్రషింగు ముగిసింది. ఈ సందర్భంగా ఎండి వి సన్యాసి నాయుడు శుక్రవారం విలేకర్లతో మాట్లాడుతూ జనవరి 21న ప్రారంభించి 1,80758 టన్నులు క్రషింగ్ చేసినట్లు చెప్పారు. రైతుల వద్దనున్న చెరుకునంతటిని తీసుకోవడం జరిగిందని, చెరుకు సరఫరా చేసిన రైతులకు త్వరలోనే పేమెంట్లు అందిస్తామని తెలిపారు. గానుగట సజావుగా జరగడానికి సహకరించిన సభ్య రైతులకు, కార్మికులకు, అధికారులకు, ప్రజా ప్రతినిధులకు ఆయన ధన్యవాదాలు తెలిపారు.

15 నుండి మట్టి నమూనాల సేకరణ

ప్రజాశక్తి-యలమంచిలి : ఈ నెల 15 నుంచి మే నెల 15 వరకు మట్టి నమూనాలు సేకరించిన భూసార పరీక్షలు చేయనున్నట్లు మండల వ్యవసాయాధికారి మోహనరావు తెలిపారు. శుక్రవారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ మండలంలోని 13 రైతు సేవా కేంద్రాల్లోని సిబ్బంది మట్టి సేకరణ చేస్తారని తెలిపారు. ఒక్కో రైతు సేవా కేంద్రంలో సుమారు 50 నుండి 60 నమూనాలు సేకరించి, అనకాపల్లి మట్టిపరీక్ష కేంద్రంలో విశ్లేషించి ఫలితాలు ఆయా రైతు సేవా కేంద్రాల ద్వారా రైతులకు అందించడం జరుగుతుందని పేర్కొన్నారు. పంట బాగా పండాలంటే నేల ఆరోగ్యంగా ఉండాలని, అందుకు నత్రజని, భాస్వరం, పొటాష్, తగిన పరిమాణాల్లో ఉండాలని, అధిక రసాయనాలు వాడితే నేల చౌడుబారుతుందని చెప్పారు. ఈ నేపథ్యంలో భూ సార పరీక్షలు ద్వారా నేల స్వభావాన్ని అంచనేసి, ఏ పోషకాలు క్షీణించాయో గుర్తించి, ఏ పంటలకు అనుకూలమో వాటిని రైతులు సూచిస్తామని చెప్పారు.

పోషకాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట : పోషకాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని బుచ్చయ్యపేట, దిబ్బిడి సర్పంచులు సుంకర లక్ష్మి, పెదిరెడ్ల మాణిక్యం అన్నారు. మండలంలోని నేతవానిపాలెంలో పోషణ పక్వాడా కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. రావికమతం సిడిపిఓ పుష్పదేవి గర్భవతులు, బాలింతలు, చిన్నారులు తీసుకోవలసిన పోషకాహారం గురించి అవగాహన కల్పించారు. గర్భిణులకు సీమంతాలు చేశారు. కార్యక్రమంలో సూపర్వైజర్లు రత్నం, అనిత, సంతోషి, అంగన్వాడీ వర్కర్లు ఆది వరలక్ష్మి, అడ్డపల్లి లక్ష్మి, జర్త వెంకటలక్ష్మి, జి చిలకమ్మ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

కె.కోటపాడు : వ్యాధుల నిర్మూలనకు చేతులు పరిశుభ్రత ఎంతో ముఖ్యమని స్థానిక ఐసిడిఎస్ పిఒ వి.మంగతాయారు అన్నారు. పోషన్ పక్వాడ కార్యక్రమంలో భాగంగా సింగన్న దొరపాలెం అంగన్వాడీ కేంద్రంలో పరిశుభ్రతపై ఏపీఎం శ్రీనివాస్ మహిళలకు అవగాహన కలిగించారు. ఈ కార్యక్రమంలో కె.చిన్నబాబు, సూపర్వైజర్ సుశీల, రాములమ్మ, ఆదిలక్ష్మి, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

కశింకోట : మండలంలోని సుందరయ్యపేటలో పోషణ పక్వాడా కార్యక్రమంలో భాగంగా 'పోషక విలువ కలిగిన ఆహారం, వెయ్యి రోజులు కోసం'పై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్వైజర్ సుచరిత, ఆదిలక్ష్మి, అంగన్వాడీ కార్యకర్తలు నూక రత్నం ,లక్ష్మి, కృష్ణవేణి, పాల్గొన్నారు.


చేతుల శుభ్రతపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

మహనీయుడు జ్యోతిరావు పూలే



విశాఖలో ర్యాలీ చేపడుతున్న కెవిపిఎస్ నేతలు

ప్రజాశక్తి -కొత్తకోట:సంఘ సంస్కర్త, మహనీయుడు మహాత్మా జ్యోతి రావుపూలే జయంతి వేడుకలు రావికమతం మండలం కొత్తకోట అంబేద్కర్ కాలనీ లో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దళిత బహుజన సమాజం ఉమ్మడి జిల్లా కన్వీనర్ మల్లేటి రాజు, బి.బుల్లిబాబు, ఎంపిటిసి పూడి దేవ తదితరులు మాట్లాడుతూ, సామాజిక ఉద్యమానికి ఊపిరి పోసిన పితామహుడు మహాత్మ జ్యోతిరావు పూలే అన్నారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ సంఘం నాయకులు పూడి అప్పారావు, పలువురు యూత్ సభ్యులు పాల్గొన్నారు...

నర్సీపట్నం టౌన్:నర్సీపట్నం వైసీపీ ఆధ్వర్యంలో మహాత్మ జ్యోతిరావు పూలే జయంతి వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పెదబొడ్డేపల్లి పెద్ద చెరువు వద్ద గల జ్యోతిరావు పూలే విగ్రహంకు పూలమాలు వేసి నివాళి అర్పించారు. పార్టీ టౌన్ అధ్యక్షులు ఏకా శివ మాట్లాడుతూ సమసమాజ నిర్మాణంలో పూలే కీలక పాత్ర పోషించారన్నారు. నాయకులు భేతిరెడ్డి విజయ్, తమరాన శ్రీను, కణితి వాసు, దాడి బుజ్జి, యాదగిరి శేషు, కోఆప్షన్ మెంబర్ రోజా పాల్గొన్నారు.

అనకాపల్లి:మహాత్మా జ్యోతిరావ్ పూలే 199వ జయంతి కార్యక్రమం పట్టణంలోని గుండాల జంక్షన్ వద్ద గల ఎస్ఆర్.శంకరన్ మీటింగ్ కాంప్లెక్స్‌లో జిల్లా బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం జరిగింది. ముందుగా పూలే చిత్రపటానికి ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం బీసీ కార్పొరేషన్ రుణాలు మంజూరుకు సంబంధించి సుమారు 400మంది లబ్ధిదారులకు రూ.8కోట్లు చెక్కుని అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ జాహ్నవి, రాష్ట్ర గవర్నర్ కార్పొరేషన్ చైర్మన్ మల్ల సురేంద్ర, జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ అధికారిని కె.రాజేశ్వరి పాల్గొన్నారు. అంబేద్కర్ మెమోరియల్ సొసైటీ అధ్యక్షులు దూలం బూసిరాజు, వైస్ ప్రెసిడెంట్ బండి అప్పారావు ఆధ్వర్యంలో నెహ్రూ చౌక్ జంక్షన్లో జ్యోతిరావు పూలే జయంతి నిర్వహించారు.

అనకాపల్లి రూరల్ : టిడిపి అనకాపల్లి పార్లమెంట్ కార్యాలయంలో జిల్లా అధ్యక్షులు బత్తుల తాతయ్య బాబు, మాజీ ఎమ్మెల్సీ బుద్ధ నాగ జగదీశ్వరరావు పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కాండ్రేగుల సత్యనారాయణ, కుప్పిలి జగన్ , మల్ల గణేష్, సాలాపు నాయుడు పాల్గొన్నారు.

బుచ్చయ్యపేట : మండలంలోని కందిపూడి ప్రాథమికోన్నత పాఠశాలలో జ్యోతిరావు పూలే జయంతి శుక్రవారం ఘనంగా జరిగింది. విద్యార్థులు జ్యోతిరావు, సావిత్రబాయి పూలే వేషధారణతో ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో హెచ్ఎం మూర్తి, ఉపాధ్యాయులు శ్రీరాములు, రమణ, ప్రశాంత్, లావణ్య పాల్గొన్నారు.

కశింకోట : స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో జ్యోతిరావు పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. జాతీయ బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర మహిళా వర్కింగ్ ప్రెసిడెంట్ పెదపాటి కళ్యాణి, హెచ్ఎం ఎంఎస్ స్వర్ణకుమారి, చింతకాయల కొర్లయ్య, పిల్లల శంకర్‌రావు పాల్గొన్నారు.

దేవరాపల్లి : దేవరాపల్లి పాత ఎంపీడీవో కార్యాలయం వద్ద జ్యోతిరావుపూలే చిత్ర పటానికి స్థానిక ఎస్ఐ టి.మల్లేశ్వరరావు, అంబేద్కర్ ఆశయ సాధన సంఘం నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు కాటపల్లి అప్పారావు ,కార్లి సాయి సుందరరావు, పతివాడ నాగభూషణం, సబ్బవరపు మాలిబాబు పాల్గొన్నారు.

పరవాడ: మహాత్మా జ్యోతిరావు పూలే నేటి యువతకు ఆదర్శమని సిపిఎం జిల్లా కార్యదర్శి జి.కోటేశ్వరరావు అన్నారు. పరవాడ సంత దగ్గర సిపిఎం ఆధ్వర్యంలో శుక్రవారం జ్యోతిరావుపూలే చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కోటేశ్వరరావు మాట్లాడుతూ పూలే గొప్ప సంఘ సంస్కర్త, సామాజిక వేత్త, సమాజ సేవకుడు, గొప్ప దేశభక్తి గల వ్యక్తి అని కొనియాడారు. పూలే దంపతులు సమాజలో నిమ్నజాతి వర్గాల అభ్యున్నతికీ, వారి విద్యాభివృద్ధికి విశేషంగా కృషి చేశారని తెలిపారు. దేశానికి స్వాతంత్ర్య వచ్చి 77 సంవత్సరాలు నిండినా నేటికీ అణగారిన వర్గాలు ఇంకా దారిద్ర్య రేఖకు దిగువనే ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు గనిశెట్టి సత్యనారాయణ, స్థానిక నాయకులు చీపురుపల్లి రమణమ్మ, బలిరెడ్డి సూరిఅప్పారావు, గొర్లి శ్రీనివాసరావు, బి అప్పలరాజు, కే లక్ష్మి, కే మాణిక్యం, వెంకట్రావు, అప్పారావు పాల్గొన్నారు.



కొత్తకోటలో...

ప్రజా సంఘాల ఆధ్వర్యాన...

అచ్యుతాపురం : ప్రజా సంఘాల ఆధ్వర్యంలో అచ్యుతాపురం మండల కాంప్లెక్స్ సముదాయంలో జ్యోతిరావుపూలే విగ్రహానికి జన విజ్ఞాన వేదిక అనకాపల్లి జిల్లా ప్రధాన కార్యదర్శి మారిశెట్టి వెంకట అప్పారావు పూలమాలవేసి నివాళులర్పించారు. పూలే దంపతుల జీవిత విశేషాలను ఆయన వివరించారు.

మధురవాడ : పిఎం.పాలెంలో సిఐటియు, కెవిపిఎస్ ఆధ్వర్యాన జ్యోతిరావుపూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కె.నాగరాజు, కె.అర్జునమ్మ, సాయి, సిహెచ్.శేషుబాబు, డి.సూరిబాబు, తదితరులు పాల్గొన్నారు.

ములగాడ : సెయింట్ ఆన్స్ జూనియర్, డిగ్రీ కళాశాలలో జాతీయ సేవా పథకం ఆధ్వర్యాన జ్యోతిరావుపూలే జయంతి నిర్వహించారు. జాతీయ సేవా పథకం జిల్లా నోడల్ అధికారి ఇపిఎస్.భాగ్యలక్ష్మి, వై.అనసూయాదేవి, అంజలి, సంధ్య, నదియా పాల్గొన్నారు.

గాజువాక : గాజువాక తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో జ్యోతిరావుపూలే చిత్రపటానికి ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ప్రసాదుల శ్రీనివాస్, శివప్రసాద్ పాల్గొన్నారు.

భెల్ ఒబిసి సంక్షేమ సంఘం ఆధ్వర్యాన జ్యోతిరావుపూలే జయంతిని నిర్వహించారు. భెల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ జి.సుబ్రహ్మణ్యం, ఉరుకూటి బాబూరావు, గౌరీశంకర్ పాల్గొన్నారు.

తగరపువలస : భీమిలి మండలం దాకమర్రిలో జ్యోతి రావు పూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ పి.రామారావు, ప తివాడ రాంబాబు, సంకురుభుక్త ప్రకాష్ పాల్గొన్నారు.

భీమిలిలోని డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కాలనీలో పూలే జయంతి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగం గోపాలరావు, జినాగేశ్వరరావు, సుజాత పాల్గొన్నారు.

సీతమ్మధార : విశాఖలోని ఎపిఇపిడిసిఎల్ కార్యాలయంలో జ్యోతిరావు పూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సంస్థ ఫైనాన్స్ డైరెక్టర్ డి.చంద్రం, డైరెక్టర్లు వి.విజయలలిత, బి.రామచంద్రప్రసాద్ పాల్గొన్నారు.

ఉక్కునగరం : ఉక్కునగరంలో ఉన్న జ్యోతిరావు పూలే విగ్రహానికి కెవిపిఎస్, పిఎన్ఎం, ఇతర ప్రజా సంఘాల నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో తిరుకోటి చిరంజీవి, వైటి.దాస్, కె.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మాధవధార : జ్యోతిరావుపూలే విగ్రహానికి పిసిసి ప్రధాన కార్యదర్శి మూల వెంకటరావు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

విశాఖలో బైకు ర్యాలీ

విశాఖ కలెక్టరేట్ : జ్యోతిరావు పూలే జయంతి సందర్భంగా కెవిపిఎస్, పిఎన్ఎం ఆధ్వర్యాన ఎల్ఐసి దరి అంబేద్కర్ విగ్రహం నుంచి గ్రీన్ పార్క్ జంక్షన్‌లోని పూలే విగ్రహం వరకూ బైక్ ర్యాలీ నిర్వహించారు. అక్కడి విగ్రహానికి నాయకులు వై.రాజు, కె.శేఖర్, ఎర్రి బాబు, నాగరాజు, రామకృష్ణ, ప్రకాష్, గోవింద్, కె.సంతోష్ కుమార్, గణేష్, కెవిపి చంద్రమౌళి, కె.నర్సింగరావు, ఎం.చంటి ఎన్వి.రమణ శ్రద్ధాంజలి ఘటించారు.



పరవాడలో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి కోటేశ్వరరావు

జ్యోతిరావు పూలే గొప్ప దేశభక్తిగలవాడని సిపిఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ అన్నారు. సిపిఐ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు, కార్యవర్గ సభ్యులు ఎ.విమల, సిఎన్.క్షేత్రపాల్, నాగభూషణం, నాగరాజు పాల్గొన్నారు.

అంటరానితనం, కులవ్యవస్థ నిర్మూలనతో పాటు బడుగు, బలహీనవర్గాల అభ్యున్నతి, మహిళోద్ధరణకు కృషి చేసిన మహనీయుడు మహాత్మా జ్యోతిరావు పూలే అని విశాఖ జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్ అన్నారు. జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో తలపెట్టిన పూలే జయంతి ఉత్సవాలను ఆయన జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. కార్పొరేషన్ల డైరెక్టర్లు మధుసూదనరావు, రామ్మోహన్ నాయుడు, ఎ.కష్ణ, ఎం.రవికుమార్, జిల్లా పరిషత్ సిఇఒ పి.నారాయణమూర్తి పాల్గొన్నారు. హోటల్ గ్రీన్ పార్క్ జంక్షన్ వద్ద తలపెట్టిన కార్యక్రమంలో కలెక్టర్‌తో పాటు ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు, వంశీకృష్ణ శ్రీనివాస్, బిసి సంక్షేమ శాఖ అధికారిణి శ్రీదేవి పాల్గొన్నారు.

ఎంవిపి.కాలనీ : వైసిపి జిల్లా కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో రాజ్యసభ సభ్యులు గొల్ల బాబూరావు, మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరావు మాట్లాడారు. పార్టీ బిసి విభాగం జిల్లా అధ్యక్షులు సనపల రవీంద్ర భరత్ నిర్వహణలో సాగిన ఈ కార్యక్రమంలో శాసన మండలి సభ్యులు కుంభా రవిబాబు, నాయకులు తిప్పల దేవన్ రెడ్డి, రవి రెడ్డి, కొండా రాజీవ్ గాంధీ పాల్గొన్నారు.



నివాళి అర్పిస్తున్న యుటిఎఫ్ నేతలు

ప్రభుత్వ బడులను పరిరక్షించుకుందాం
యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు శ్రీలక్ష్మీ

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్:ప్రభుత్వ బడులను పరిరక్షించుకుందామని యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు శ్రీలక్ష్మి అన్నారు. శుక్రవారం నర్సీపట్నం సిఐటియూ కార్యాలయంలో ప్రస్తుత విద్యారంగం ఎదుర్కొం టున్న సమస్యలు అనే అంశంపై యుటిఎఫ్ నర్సీపట్నం డివిజన్ ముఖ్య నాయకుల సమావేశం జిల్లా కార్యదర్శి కళింగ సతీష్ ఆధ్వర్యంలో జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన జిల్లా యుటిఎఫ్ అధ్యక్షురాలు శ్రీలక్ష్మి ముందుగా జ్యోతిరావు పూలే జయంతి సందర్భంగా పుష్పాంజలి ఘటించి ఆయన సేవలను కొనియాడారు. ఆధునిక భారతదేశ మొదటి మహిళా ఉపాధ్యాయురాలు గా తన భార్యనే తీర్చిదిద్దిన ఆ మహనీయుడు ఆశయాలను సాధించడమే ధ్యేయంగా పనిచేస్తామని తెలిపారు. ప్రభుత్వాలు మారిన తమ పాలసీలు మారలేదని, సంఘటితంగా ప్రభుత్వ బడులను పరిరక్షించుకోవడానికి రాజీలేని పోరాటాన్ని నిర్వహించి తీరుతామని, దీనికి సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహాధ్యక్షులు గాయత్రి, జన విజ్ఞాన వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షులు త్రిమూర్తులు రెడ్డి, ఐద్వా నాయకులు గౌరీ, నర్సీపట్నం మండల యుటిఎఫ్ కన్వీనర్ సాంబమూర్తి, గొలుగొండ మండల ప్రధాన కార్యదర్శిలు చిట్ల అప్పారావు, శోభన్, కోటవురుట్ల మండల అధ్యక్షులు నరసింగరావు, రోలుగుంట మండల అధ్యక్షులు నాగభూషణం, నాతవరం మండలం కార్యదర్శి మోహన్, సీనియర్ నాయకులు పాల్గొన్నారు.



మార్నింగ్ వాక్ చేపడుతున్న అనిత

ప్రజా సమస్యలు తెలుసుకునేందుకు మార్నింగ్ వాక్

ప్రజాశక్తి -నక్కపల్లి:ప్రజల కష్ట సుఖాలు తెలుసుకుని సమస్యలను పరిష్కరించేందుకే మార్నింగ్ వాక్ చేపట్టినట్లు హోం మంత్రి వంగలపూడి అనిత అన్నారు. మండలంలోని వేంపాడు గ్రామంలో శుక్రవారం ఉదయం స్థానిక నేతలతో కలిసి మార్నింగ్ చేపట్టారు. స్థానిక నాయకులు, మహిళలు అనితకు ఘన స్వాగతం పలికారు. ప్రజా సమస్యలను తెలుసుకుంటూ ఆమె మార్నింగ్ వాక్ చేపట్టారు. గ్రామంలో నెలకొన్న సమస్యలను గ్రామస్తులు ఆమె దృష్టికి తీసుకెళ్లారు. ఉపాధి హామీ పథకంలో ఏడు వారాల నుండి పేమెంట్లు చెల్లించకపోవడంతో కూలీలు ఇబ్బందులు పడుతున్నారని సిపిఎం నాయకులు యాదగిరి నవీన్ సమస్యను హోం మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. తాగునీటి సమస్యలు పరిష్కరించాలని, లైబ్రరీ ఏర్పాటు చేయాలని కోరారు.

ఈ సందర్భంగా హోం మంత్రి అనిత మాట్లాడుతూ, గ్రామంలో చేపట్టిన మార్నింగ్ వాక్ లో గ్రామస్తులు పలు సమస్యలను తన దృష్టికి తీసుకువచ్చారన్నారు. ప్రధానంగా తాగునీరు, రోడ్లు డ్రైనేజీ సమస్యలను గుర్తించినట్లు తెలిపారు. 15 రోజుల్లోగా తాగునీటి సమస్యను పరిష్కరిస్తామన్నారు. పాయకరావుపేట నియోజకవర్గం లో నేరుగా గ్రామాల్లో పర్యటించి, సమస్యలను గుర్తించి అధికారులతో రివ్యూ నిర్వహించి సమస్యలు పరిష్కారానికి చర్యలు చేపట్టనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ మండల శాఖ అధ్యక్షులు కొప్పిశెట్టి వెంకటేష్, ఎంపీటీసీ సభ్యులు మధు, టిడిపి నాయకులు కల్లేపల్లి అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వైద్య సిబ్బంది

జాతీయ మాతృత్వ దినోత్సవం

ప్రజాశక్తి-రోలుగుంట:రోలుగుంట మండలం బుచ్చంపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద శుక్రవారం జాతీయ మాతృత్వ దినోత్సవంను ఘనంగా నిర్వహించారు. పీహెచ్‌సి ఎంపీహెచ్ఓ నూకరాజు మాట్లాడుతూ, ప్రపంచానికి పరిచయం చేసే దేవత అమ్మ అన్నారు. మనమందరం అమ్మను గుర్తు చేసుకుంటూ జాతీయ మాతృత్వ దినోత్సవాన్ని జరుపుకోవడం సంతోషకరమన్నారు. తల్లిని ప్రతీ ఒక్కరు పూజించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సిసి కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి

ప్రజాశక్తి -రావికమతం : ఎటువంటి అవాచనీయ సంఘటనలు చోటు చేసుకునాన తక్షణమే తెలుసుకునేందుకు గాను సీసీ కెమెరాలు ఎంతగానో ఉపయోగపడతాయని రావికమతం ఎస్ఐ రఘువర్మ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన పత్రిక విలేకరులతో మాట్లాడుతూ, పెద్దపెద్ద అపార్ట్మెంట్స్, బిల్డింగ్స్, షాపింగ్లు, ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలు, దేవాలయాలు, ప్రముఖమైన ప్రదేశాలలో సీసీ కెమెరాలు స్వచ్ఛందంగా ఏర్పాటు చేసుకోవాలని ఆయన సూచించారు. దీంతో దొంగతనాలు, చోరీలు వంటి అసాంఘిక కార్యక్రమాలు అరికట్టేందుకు ఇవి ఎంతగానో ఉపయోగ పడతాయన్నారు. నిందితులను అతివేగంగా గుర్తించేందుకు ఉపయోగపడతాయన్నారు.

ఆర్థిక నేరగాళ్లను స్వదేశానికి తీసుకురావాలి

సిపిఐ జాతీయ కార్యదర్శి నారాయణ



మాట్లాడుతున్న నారాయణ

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్:కేంద్రంలో బిజెపి ప్రభుత్వం చాలా ప్రమాదకరంగా మారిందని, లక్షల కోట్లు దోచుకెళ్లిన కార్పొరేట్ కంపెనీల యజమానులకు వత్తాసు పలుకుతూ పేదలపై పెనుభారం మోపుతుందని సిపిఐ జాతీయ కార్యదర్శి కె నారాయణ విమర్శించారు. నర్సీపట్నం కృష్ణ ప్యాలెస్ లో శుక్రవారం రాజ్యాంగ రక్షణ - లౌకికవాదం పరిరక్షణకై సిపిఐ ఆధ్వర్యంలో జిల్లా సదస్సు నిర్వహించారు. జిల్లా కార్యదర్శి బాలేపల్లి వెంకటరమణ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ముఖ్యఅతిథిగా నారాయణ హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, భారతదేశంలో విలువైన అటవీ సంపద, ఏజెన్సీ ఉత్పత్తులు ఉన్నప్పటికీ మన ప్రజలకి ఉపయోగపడకుండా కార్పొరేట్ కంపెనీల వారు పేదలపై పెత్తనం చలాయిస్తూ వారిని దోచుకుంటున్నారన్నారు. పాలకులకు చిత్త శుద్ధి ఉంటే విదేశాలకు పారిపోయిన ఆర్థిక నేరస్తులను దేశానికి తీసుకురావాలని సవాల్ విసిరారు. మూడుసార్లు అధికారంలోకి వచ్చిన బిజెపి ప్రభుత్వం అణగారిన వర్గాల మహిళలపై అత్యాచారాలు జరుగుతున్నా తీసుకుంటున్న చర్యలు ఏమీ కానరాలేదన్నారు.జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో 100 రోజుల పని కల్పించాల్సింది పోయి ఆ చట్టాన్ని దివాళా తీసే విధంగా చేస్తున్నారన్నారు. పేద ప్రజల సమస్యలపై కమ్యూనిస్టులు పోరాడితే అక్రమ కేసులు బనాయిస్తున్నారని మండిపడ్డారు. ఇప్పటికైనా కేంద్ర రాష్ట్ర పాలకుల తీరు మారకపోతే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. విశాఖలో జేఈఈ పరీక్షలు రాయకుండా నష్టపోయిన విద్యార్థులకు పవన్ కళ్యాణ్ నరేంద్ర మోడీతో మాట్లాడి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జెవి సత్యనారాయణమూర్తి, అల్లూరి సీతారామరాజు జిల్లా కార్యదర్శి పొట్టిక సత్యనారాయణ, జిల్లా సహాయ కార్యదర్శి రామునాయుడు, రాజాన దొరబాబు పాల్గొన్నారు.

విశాఖకలెక్టరేట్:ముంబాయి ఉగ్రదాడుల సూత్రధారి తహవూర్ హుస్సేన్ రానాని అమెరికా నుంచి మన దేశానికి రప్పించగలిగిన ప్రధాని మోడీ విదేశాల్లో దాక్కున్న ఆర్థిక ఉగ్రవాదులను రప్పించడం లేదని సిపిఐ జాతీయ కార్యదర్శి కె నారాయణ విమర్శించారు. భగత్ సింగ్, రాజ్ గురు, సుఖదేవ్ ల వర్ధంతి మార్చి 23 నుంచి అంబేద్కర్ జయంతి ఏప్రిల్ 14 వరకు దేశవ్యాప్తంగా కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ ప్రజా వ్యతిరేక, రాజ్యాంగ విరుద్ధ,విధానాలకు వ్యతిరేకంగా చేపట్టిన ప్రచారంలో భాగంగా విశాఖ జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద శుక్రవారం సాయంత్రం ఏర్పాటుచేసిన బహిరంగ సభలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. దేశంలో ఆర్థిక నేరాలకు పాల్పడి ప్రజల సంపదను దోచుకుపోయిన 29 మంది ఆర్థిక ఉగ్రవాదుల్లో 28 మంది గుజరాత్ చెందిన వాళ్లేనన్నారు. ప్రజలు పన్నుల రూపంలో ప్రభుత్వాలకు కట్టిన సొమ్మును దోచుకుపోయిన వీరు ఉగ్రవాదుల కంటే దుర్మార్గులని పేర్కొన్నారు. దేశంలో నిరర్థక ఆస్తుల విలువ బిజెపి అధికారంలోకి వచ్చేనాటికి రెండున్నర లక్షల కోట్లు కాగా బిజెపి అధికారంలోకి వచ్చిన తర్వాత 11 సంవత్సరాల్లో పదహారున్నర లక్షల కోట్లకు పెరిగాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సహాయ కార్యదర్శి జె.వి సత్యనారాయణమూర్తి, జిల్లా కార్యదర్శి ఎం పైడిరాజు, కార్పొరేటర్ ఎజె స్టాలిన్, విశాఖ ఉక్కు గుర్తింపు యూనియన్ ప్రధాన కార్యదర్శి డి. ఆదినారాయణ,పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు ఆర్. శ్రీనివాసరావు,ఎ.విమల, ఎస్.కె రెహమాన్, చంద్రశేఖర్,ఎం మన్మధరావు, కె సత్యనారాయణ, కె సత్యాంజనేయ, జి రాంబాబు,సి.ఎస్ క్షేత్రపాల్, ఎఐటియుసి జిల్లా ఉపాధ్యక్షుడు జె.డి నాయుడు, ఎన్ నాగభూషణం పాల్గొన్నారు.

రైతులకు రాయితీపై పనిముట్లు అందజేత

ప్రజాశక్తి- నక్కపల్లి:పాయకరావుపేట నియోజక వర్గంలో నాలుగు మండలాల్లో గల రైతులకు రాయితీపై వ్యవసాయ పనిముట్లను హోం మంత్రి వంగలపూడి అనిత చేతుల మీదుగా శుక్రవారం అందజేశారు. నక్కపల్లిలో ఆమె క్యాంప్ కార్యాలయం వద్ద సుమారుగా 8.5లక్షల విలువ గల పవర్ టిల్లర్లు, రోటోవేటర్లు, పవర్ స్ప్రేయర్స్, దమ్ము సెట్లు, దుక్కి సెట్లు , బ్రష్ కట్టర్లు ను రాయితీ పై రైతులకు వ్యవసాయ పనిముట్లు అందజేశారు ఈ సందర్భంగా హోం మంత్రి అనిత మాట్లాడుతూ, గత ఐదు సంవత్సరాల వైసిపి కాలంలో రైతులకు రాయితీపై పనిముట్లు ఇవ్వలేదని, కూటమి ప్రభుత్వ అధికారంలోకి వచ్చిన తర్వాత అందజేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ మండల శాఖ అధ్యక్షులు కొప్పిశెట్టి వెంకటేష్, క్లస్టర్ ఇంచార్జ్ కొప్పిశెట్టి, పలువురు ప్రజా ప్రతినిధులు, నాయకులు, నాలుగు మండలాల వ్యవసాయ అధికారులు ఉమా ప్రసాద్, సౌజన్య, ఆది నారాయణ, సరోజినీ, ఏఈఓలు సత్యనారాయణ, సాయి కుమారి, ఆర్ ఎస్ కె సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ఇంటర్ ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి-కొత్తకోట:ఇంటర్ తొలి ఏడాది ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కొత్తకోట జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సత్యవతి తెలిపారు. స్థానిక విలేకరులతో శుక్రవారం ఆమె మాట్లాడుతూ, ఏపీ ఇంటర్ బోర్డు కార్యదర్శి ఆదేశాల మేరకు ఏప్రిల్ 1 నుంచి ద్వితీయ సంవత్సరం తరగతులు ప్రారంభించా మన్నారు. ప్రస్తుతం కళాశాల్లో అకడమిక్ క్లాసులు నిర్వహణతో పాటు బ్రిడ్జ్ కోర్స్ తరగతులు కూడా ప్రారంభించామన్నారు. పదవ తరగతి పరీక్షలు రాసిన విద్యార్థులు ఫలితాలు రాకపోయినా హాల్ టికెట్ ఆధారంగా ఎంపిసి, బైపిసి, సిఈసి, హెచ్ఈసి, ఒకేషనల్ గ్రూపులలో జాయిన్ కావాల్సిందిగా ఆమె కోరారు. ఎంబైపిసి గ్రూప్ ఆప్షన్ కూడా అందిస్తున్నామని, ఈ అవకాశాన్ని సద్వి నియోగం చేసు కోవాలన్నారు. తమ కళాశాలలో డిజిటల్ విద్య, ల్యాబ్ సౌకర్యంతో పాటు లైబ్రరీ, క్రీడా సామాగ్రి, మధ్యాహ్న భోజనం వంటి సౌకర్యాలతో పాటు ఇంటర్ తర్వాత జరిగే మెయిన్స్, అడ్వాన్స్ నీట్,తదితర ప్రవేశ పరీక్షలకు కూడా శిక్షణ ఇస్తున్నామని ప్రిన్సిపాల్ సత్యవతి పేర్కొన్నారు.



చెరువును పరిశీలిస్తున్న అధికారులు

జనసేన నేత ఫిర్యాదుపై సర్వే

ప్రజాశక్తి-రోలుగుంట:ఇటీవల మండలంలో రాజన్నపేట రెవెన్యూ పరిధిలోని బోడిమెట్ట నల్లరాయి క్వారీ నిర్వహణలో పంట చెరువును ఆక్రమించి రహదారి నిర్మించారని జనసేన చోడవరం నియోజకవర్గ ఇన్‌చార్జ్ పివిఎస్ఎన్.రాజు క్వారీ నిర్వాహకులపై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా శుక్రవారం ఇరిగేషన్ ఏఈ సూర్య, మైన్స్ అసిస్టెంట్ జువాలజీ వెంకటరమణ, రెవెన్యూ వీఆర్వో సర్వే నిర్వహించారు. క్వారీ ఆవరణలో భూపతిరాజు చెరువు గర్భం 3.66 సెంట్ల 57-7 సర్వే నెంబరులో ఉందని, 57 సర్వే నెంబరులో 0-58 ఉన్నట్లు వీఆర్వో తెలియజేసినట్లు తెలిపారు. దీనిపై పూర్తి వివరాలు తెలియాలంటే 16న సమగ్ర సర్వే నిర్వహిస్తామని అధికారులు తెలిపారు.

ఉద్యానవన శాఖ బృందం పర్యటన

ప్రజాశక్తి-హుకుంపేట:మండలంలోని గత్తుం పంచాయతీ మారుమూల గ్రామంలో ఉద్యానవన శాఖకు చెందిన ప్రముఖ అధికారుల బృందం పర్యటించింది. ఉద్యానవన శాఖ అదనపు డైరెక్టర్, ప్రాజెక్ట్ ఆఫీసర్ (పిఒ) ఎం. వెంకటేశ్వర్లు, జాయింట్ డైరెక్టర్ ఆఫ్ హార్టికల్చర్ పుల్లా రెడ్డి, డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ హార్టికల్చర్ రమేష్, జిల్లా ఉద్యానవన శాఖ సంచాలకులు ఎ. రమేష్ కుమార్ జంగం పుట్టులో శుక్రవారం సందర్శించారు. చుట్టుపక్కల ఏడు గ్రామాలలో వ్యవసాయ అభివృద్ధికి అవకాశాలను గుర్తించడానికి సందర్శించి, వారు పండిస్తున్న పంటలను పరిశీలించారు. గ్రామ రైతులతో సంభాషించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

సంక్షేమ ఫలాలు ప్రజలకు అందేలా చూడాలి

- హోం మంత్రి అనిత



అధికారులతో మాట్లాడుతున్న అనిత

ప్రజాశక్తి -నక్కపల్లి:పాయకరావుపేట పంచాయితీరాజ్ అతిథిగృహంలో నియోజకవర్గంలో వివిధ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై హోం మంత్రి వంగలపూడి అనిత శుక్రవారం జిల్లా, నియోజకవర్గస్థాయి అధికారులతో సమీక్షించారు. ముందుగా జ్యోతిరావు పూలే జయంతి సందర్భంగా పూలే చిత్రపటానికి పూల మాలలు వేసి, నివాళులర్పించారు. వివిధ అంశాలపై శాఖల వారీగా అధికారులతో సమీక్షించి, పలు సూచనలు చేశారు.గ్రామాల్లో చేపట్టనున్న అభివృద్ధి పనులు పెండింగ్ లేకుండా చూడాలని, సంక్షేమ ఫలాలు సక్రమంగా ప్రజలకు అందేలా చర్యలు చేపట్టాలన్నారు. ఆయా శాఖ అధికారులు తమ విధులను సక్రమంగా చేపట్టాలన్నారు.పాయకరావుపేట నియోజకవర్గంలో బల్క్ డ్రగ్స్,స్టీల్ ప్లాంట్ రాబోతున్నాయని, బల్క్ డ్రగ్ పూర్తి అయితే 11 వేల పెట్టుబడులు రాబోతున్నాయని, నిరుద్యోగ యువతకు పెద్ద సంఖ్యలో ఉద్యోగావకాశాలు రానున్నాయని వెల్లడించారు. .నియోజకవర్గంలో త్వరలోనే పోలవరం పనులు పూర్తి కాబోతున్నాయన్నారు. త్వరలోనే ఇంటింటికి కులాయి ద్వారా తాగునీరు సరఫరా చేస్తామని వెల్లడించారు.



అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్

పౌష్టికాహారంతో ఆరోగ్యం

ప్రజాశక్తి -కొత్తకోట:అంగన్వాడీ కేంద్రాల ద్వారా అందించే పౌష్టికాహారంలో విలువైన పోషకాలు వుంటాయని వీటిని సద్వినియోగం చేసుకోవాలని మేడివాడ సెక్టార్ ఐసిడిఎస్ సూపర్ వైజర్ రాజరాజేశ్వరి అన్నారు. సెక్టార్ పరిధిలో దొండపూడి, మత్స్యవానిపా లెం పంచాయతీ పరిధిలో అంగన్వాడీ కేంద్రాలలో 7వ పౌష్టికాహార పక్షోత్సవాలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈనెల 8వ తేదీ నుంచి 22 వరకు పౌష్టికహారా పక్షోత్సవాలు నిర్వహిస్తున్నామన్నారు. గర్భిణీలు, బాలింతలు, చిన్నారులు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని అంగన్వాడీ కార్యకర్తలకు సూచించారు. గ్రామ నాయకులు ఆర్థిక సాయం తో సమకూ ర్చిన 80మంది పిల్లలకు బూట్లు ఉచితంగా పంపిణీ చేసారు. ఈ కార్యక్రమంలో దొండపూడి ఉప సర్పంచ్ జి. రాజారావు, మాజీ వైస్ సర్పంచ్ ఆచారి,గ్రామ టీడీపీ నాయకులు చిరంజీవి పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన



శంకుస్థాపన చేస్తున్న విజయ్

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్: నర్సీపట్నం నియోజకవర్గంలోని పలు గ్రామాలకు సాగునీరు అందిస్తున్న రావణాపల్లి రిజర్వాయరుకు రాబోయే రోజుల్లో పోలవరం ఎడమ కాలువ నుంచి నీరు తీసుకురావడంపై స్పీకర్ చింతకాయల అయ్యన్న పాత్రుడు చర్యలు తీసుకుంటున్నారని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతకాయల విజయ్ పేర్కొన్నారు. శుక్రవారం నర్సీపట్నం మున్సిపాలిటీలో 3, 4, 5 వార్డుల్లో సీసీ రోడ్లు, కల్వర్టులు, కాలువల అభివృద్ధి పనులకు కౌన్సిలర్ చింతకాయల పద్మావతితో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా విజయ్ మాట్లాడుతూ రావణాపల్లి రిజర్వాయర్ ద్వారా ప్రస్తుతం రెండు వేల ఎకరాలకు పైగా సాగునీరు అందుతుందన్నారు. భవిష్యత్తులో ఈ నీటి సరఫరాను పది వేల ఎకరాలకు విస్తరించే లక్ష్యంతో చోడవరం వద్ద పోలవరం ఎడమ కాలువ నుంచి నీటిని తరలించే ప్రణాళికలు స్పీకర్ అయ్యన్నపాత్రుడు రూపొందించారని తెలిపారు. రాబోయే ఎన్నికల ముందు ఈ ప్రాజెక్టును పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకుంటారని తెలిపారు. అలాగే 3, 4, 5 వార్డుల్లో రూ. 60 లక్షలతో రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ, కల్వర్టుల వంటి పలు అభివృద్ధి పనులు చేపట్టినట్టు చెప్పారు. గత ప్రభుత్వ హయాంలో పైపులైన్లు వేసేందుకు రోడ్లను తవ్వి అలాగే వదిలేయడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని విమర్శించారు. రాబోయే నాలుగేళ్లలో నియోజకవర్గాన్ని పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో 3వ వార్డు టీడీపీ నాయకులు మ్రా అప్పలరాజు, వెంకట రిషికుమార్, నాలుగవ వార్డు నాయకులు దాడి శ్రీను, కొల్లాన పరదేశి నాయుడు, 5వ వార్డు ఇన్‌చార్జ్ శ్రీకాంత్, బాబూరావు పాల్గొన్నారు.

ల్యాప్ టాప్‌ల పంపిణీ

ప్రజాశక్తిపాడేరు: విభిన్న ప్రతిభావంతులైన ముగ్గురు డిగ్రీ విద్యార్థులకు ల్యాప్ టాప్ లను జిల్లా కలెక్టర్ ఎఎస్ దినేష్ కుమార్ చేతుల మీదుగా పంపిణీ చేసారు. ఇంటర్మీడియట్ ఆపైబడి చదువుతున్న విభిన్న ప్రతిభావంత విద్యార్థులు టచ్ ఫోన్లకు ఆన్లైన్ లో దరఖాస్తు చేసుకోవాలని ఈ సందర్భంగా కలెక్టర్ కోరారు. శుక్రవారం స్థానిక ఐటిడిఎలో జరిగిన మీకోసం కార్యక్రమం అనంతరం విభిన్న ప్రతిభావంతుల శాఖ ఆధ్వర్యంలో ఈ ల్యాప్ టాప్ లను పంపిణీ చేసారు. జేసి అభిషేక్ గౌడ, డిఆర్ఓ కె.పద్మలత పాల్గొన్నారు.